ప్రజాశక్తి
సోమవారం 24 నవంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ఎస్టీ కాలనీ చిన్నారులు

చదువుకు 'ఆధార్' అడ్డు..!

- ఆధార్ లేక.. విద్యకు దూరం
- బడి బయటే ఎస్టీ కాలనీ చిన్నారులు
- నూరు శాతం అక్షరాస్యతపై అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి-సిఎస్‌పురం రూరల్

'బడి ఈడు పిల్లలు అందరూ బడిలోనే ఉండాలి.. నూరు శాతం అక్షరాస్యత సాధించేందుకు కృషి చేయాలి..' అంటూ అధికారులు మాటలు చెప్పడమే తప్ప ఆచరణలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. విద్య ప్రాధాన్యత గురించి తెలియని ఎస్టీ కాలనీ వాసులకు విద్యపై అవగాహన కల్పించి చిన్నారులను పాఠశాలలలో చేర్పించాల్సి ఉంది. బడిలో చేర్పించిన చిన్నారులకు అవసరమైన సర్టిఫికెట్లు ఇప్పించి ప్రభుత్వ పథకాలు లబ్ధి చేకూరేలా కషి చేయాల్సి ఉండగా మండల విద్యాశాఖ అధికారులు ఆ విధంగా చేయక పోవడంతో మండలంలోని సిఎస్‌పురం ఎస్టీ కాలనీ, నల్లమడుగుల ఎస్టీ కాలనీ, కె.అగ్రహారం కాలనీ, ఉప్పలపాడు ఎస్టీ కాలనీ, ఆది ఆంధ్రేయ కాలనీలకు చెందిన అనేక మంది చిన్నారులు ఆధార్ కార్డులు లేని కారణంగా విద్యకు దూరంగా ఉంటున్నారు. మండలంలోని కే అగ్రహారం ఎస్టీ కాలనీలో 52 మంది బడిఈడు పిల్లలు ఉండగా పదిమంది మాత్రమే బడికి వెళుతున్నారు. 26 మందికి ఆధార్ కార్డులు లేని కారణంగా ప్రభుత్వ సదుపాయాలు అందే అవకాశం లేక బడిలో చేర్చుకోలేదని చిన్నారుల తల్లిదండ్రులు తెలిపారు. బడి బయట ఉన్న ▶ 2లో

ఇసుక కొరత లేకుండా
ఉచిత ఇసుక పాలసీ అమలు

- గ్రానైట్ పరిశ్రమల సమస్యల పరిష్కారానికి చర్యలు
- మంత్రి కొల్లు రవీంద్ర
- ఒంగోలులో గనుల శాఖ కార్యాలయానికి శంకుస్థాపన

మాట్లాడుతున్న గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో ఇసుక కొరత లేకుండా ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తున్నామని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో గనుల శాఖ కార్యాలయాలను నిర్మిస్తామని చెప్పారు. ఆదివారం స్థానిక దక్షిణ బైపాస్ రోడ్డు వద్ద రూ.2.14 కోట్లతో నిర్మించనున్న కొత్త గనుల శాఖ కార్యాలయానికి రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటిగా ప్రకాశం జిల్లా ఒంగోలులో గనులశాఖ కార్యాలయాన్ని నిర్మించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో ఒంగోలులో నిర్మించే గనుల శాఖ కార్యాలయాన్ని మోడల్ కార్యాలయంగా నిర్మించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఒంగోలులో 20 సెంట్లు భూమిలో 2 కోట్లా 14 లక్షల రూపాయల వ్యయంతో సుందరమైన భవనాన్ని నిర్మించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. గ్రానైట్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అమెరికా తర్వాత రాష్ట్రంలో వైజాగ్ లో పరిశ్రమలు స్థాపించడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని, గూగుల్ సంస్థ వైజాగ్ లో పరిశ్రమలను సాధించడానికి ముందుకు వచ్చిందన్నారు. ఇటీవల జరిగిన వైజాగ్ పారిశ్రామిక వేత్తల పెట్టుబడుల సదస్సులో 13.5 లక్షల కోట్ల రూపాయలు పెట్టు బడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారన్నారు. పరిశ్రమల స్థాపనతో 17 లక్షలా 50వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో గ్రానైట్ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఒంగోలులో పారిశ్రామిక వేత్తలకు అందుబాటులో గనుల శాఖ కార్యాలయం ఏర్పాటు ▶ 2లో

ప్రకాశం ఇన్‌ఛార్జి ఎస్పీగా ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీగా బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ నియమించబడ్డారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లా ఎస్పీగా ఉన్న వి.హర్షవర్ధన్‌రాజు డిసెంబర్ 2 వరకు సెలవులో ఉంటున్నారు. ఆ సమయంలో బాపట్ల జిల్లా ఎస్పీగా ఉన్న బి.ఉమామహేశ్వర్ ప్రకాశం జిల్లాకు ఇన్‌ఛార్జి ఎస్పీగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

ఎస్పీ ఉమామహేశ్వర్

ప్రతి ఆదివారం హ్యాపీ సండే

కలెక్టర్ వినోద్ కుమార్ 8లో ▲

'బండ్లమూడి' దాడి ఘటనలో
ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి మండలం బండ్లమూడి దళితవాడలోని దళితులపై దాడి ఘటనలో ఐదుగురిని ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం అరెస్ట్ చేశారు. ఇటీవల బండ్లమూడి దళితవాడకు చెందిన కంట్లం ఏసుదాసు మరికొందరిపై బండ్లమూడి గ్రామానికి చెందిన పెత్తందారులు దాడి చేసి.. గాయపరిచిన సంగతి పాఠకులకు తెలిసిందే. గాయపడిన బాధితులు రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొంది స్వగ్రామాలకు చేరారు. ఈ నెల మూడో తేదీన కంట్లం ఏసుదాసు స్థానిక పోలీస్ స్టేషన్లో తమపై దాడి చేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. సోమవారం ఈ ఘటనపై విచారించడానికి రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎల్ జవహర్ బండ్లమూడి గ్రామాన్ని సందర్శిస్తున్న నేపథ్యంలో ముందుగానే ఆదివారం ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిందితులుగా పేర్కొనబడిన జి బాల ఓబుల్‌రెడ్డి, వి శ్రీనివాసులరెడ్డి, వి.రమణారెడ్డి, వి.ఏడుకొండలు, పి సంజీవిలను అరెస్ట్ చేశారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని
26న బైక్ ర్యాలీ, ధర్నా

- కార్మిక, కర్షక సంఘాల పిలుపు

మాట్లాడుతున్న చుండూరి రంగారావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కార్మిక హక్కులను హరిస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ అమలును వెంటనే రద్దు చేయాలని, 2021 డిసెంబర్ 9న పార్లమెంట్ సాక్షిగా మోడీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 26న నిర్వహించనున్న బైక్ ర్యాలీ, ధర్నాను విజయవంతం చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఆదివారం ఒంగోలు సిఐటియు కార్యాలయంలో కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం రమేష్, జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసులు, ఎఐటియుసి నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు, ఐఎఫ్టీయూ నాయకులు జి. తిరుమలరావు, వి.రామ్మోహన్ తదితరులు మాట్లాడారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సుదీర్ఘ కాలం పాటు రైతాంగ పోరాటంతో వెనక్కి తగ్గిన కేంద్రం నల్ల చట్టాలు రద్దు చేస్తామని ప్రకటించి, డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తామని రాత పూర్వక హామీ ఇచ్చిన అంశాన్ని నేతలు ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతులకు హామీ ఇచ్చిన మేరకు ఎంఎస్‌పి అమలు హామీ, కేసుల ఉపసంహరణ వంటి ఇతర వాగ్దానాలను అమలు చేయలేదని విమర్శించారు. 736 మంది రైతుల ప్రాణత్యాగాల ఫలితంగా ఇచ్చిన

క్రీడా జ్యోతితో మంత్రి స్వామి, ఎమ్మెల్యే ఉగ్ర, దామచర్ల సత్య

విద్యతో పాటు ఆటలు కూడా అవసరం

8లో ▲

ఏపీఎన్‌జివో యూనిట్ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు టౌన్ ఎన్జిఓ సంఘ భవనంలో ఆదివారం ఏపీ ఎన్జీఓ గిద్దలూరు తాలూకా యూనిట్ ఎన్నికలు జరిగాయి. గిద్దలూరు తాలూకా యూనిట్ నూతన కార్యవర్గ అధ్యక్షులుగా టి నరేష్‌బాబు సీనియర్ అసిస్టెంట్ పిపి యూనిట్, గిద్దలూరు, సహాధ్యక్షులుగా ఎంపి ఆవులయ్య ఎంపిహెచ్ ఈఓ పిహెచ్‌సి, రాజుపాలెం, ఉపాధ్యక్షులుగా డి మల్లికార్జునరెడ్డి ఎంపిహెచ్‌ఎస్ పిహెచ్‌సి కృష్ణంశెట్టిపల్లి ఐఎస్ తీర్థులు సీనియర్ అసిస్టెంట్, ఎంపిడిఓ కార్యాలయం గిద్దలూరు సి శ్రీనివాసులు, వార్డ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ గ్రామ సచివాలయం కోమరోలు, కార్యదర్శిగా ఎన్ కాశీరమణ, వార్డ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీ గిద్దలూరు, సంయుక్త కార్యదర్సులుగా డిఎస్ రామయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సెరీకల్చర్ గిద్దలూరు, ఎస్‌కె హసీనా స్టాఫ్ నర్స్ పిహెచ్సి కోమరోలు. పియంయస్ రెడ్డి వార్డ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ గ్రామ సచివాలయం కొత్తకోట, సంయుక్త కార్యదర్శిగా సి హెచ్ సుజాత ఎంపిహెచ్ గ్రామ సచివాలయం గిద్దలూరు, కోశాధికారిగా జి వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ ఆఫీసర్, డిఎంఓ కార్యాలయం, గిద్దలూరు, ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కొత్తపల్లి మంజేష్ ప్రకటించారు. ఈ ఎన్నికలకు సహాయ ఎన్నికల అధికారిగా ఒంగోలు తాలూకా యూనిట్ కార్యదర్శి షేక్ మగ్దుమ్ షరీఫ్, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ఉపాధ్యక్షులు పి రామాంజనేయులు వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన గిద్దలూరు తాలూకా యూనిట్ కార్యవర్గ సభ్యులను జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె శరత్ బాబు, ఆర్‌సిహెచ్ కృష్ణారెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కె శివ కుమార్, జిల్లా సహాధ్యక్షులు ఎం వేంకటేశ్వరరావు, మార్కాపురం అధ్యక్ష కార్యదర్శులు బి శ్రీనివాసశాస్త్రి, జె రవికిరణ్, యర్రగొండపాలెం అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ రవికుమార్, హృదయరంజన్ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో నూతనంగా ఎన్నికైన ఏపీ ఎన్జీఓ యూనిట్ కార్యవర్గం

పొదిలి: ఎపిఎన్‌జిఓ అసోసియేషన్ పొదిలి తాలూకా యూనిట్ ఎన్నికల నామినషన్ల ప్రక్రియ శుక్రవారం స్థానిక ఎన్‌జిఓ సంఘ భవనంలో జరిగింది. ఒక్కొక్క పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయగా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి, కంభం తాలూకా అధ్యక్షులు వి రాధాకృష్ణమూర్తి ప్రకటించారు. ఈ ఎన్నికలలో పొదిలి తాలూకా యూనిట్ నూతన అధ్యక్షులుగా స్థానిక అర్బన్ పిహెచ్‌సి, ఎంపిహెచ్ఎ లేళ్ల శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రికార్డు అసిస్టెంట్ షేక్ సందాని బాషా, సహాధ్యక్షులుగా మర్రిపూడి డిప్యూటీ ఎంపీడీవో ఎస్‌కె నాగూర్‌వలి, ఉపాధ్యక్షులుగా పొదిలి ఎస్‌టిఓ ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్ షేక్ కరిముల్లా, కెల్లంపల్లి పంచాయతీ సెక్రెటరీ షేక్ అబ్దుల్ ఆరిఫ్, గొట్లగట్టు పిఎస్‌సి, ఎంపిహెచ్ఎ జె వెంకటేశ్వర్లు, పొదిలి వ్యవసాయ శాఖ సీనియర్ అసిస్టెంట ఎస్‌కె యూసుఫ్, మహిళా ఉపాధ్యక్షులుగా పొదిలి ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్ పి కళాప్రపూర్ణ, కార్య నిర్వాహక కార్యదర్శిగా కాకర్ల పిహెచ్‌సి ఫార్మసీ ఆఫీసర్ బి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్సులుగా కేకే మిట్ల పిహెచ్‌సి, ఎంపీహెచ్ఏ వివి నరసారెడ్డి, గొట్లగట్టు ఉన్నత పాఠశాల జూనియర్ అసిస్టెంట్ షేక్ గౌసియా, పొదిలి ఎమ్మార్వో ఆఫీస్ విఆర్‌ఓ ఎం రమేష్, సూదనగుంట విఆర్‌ఓ కెవి అనిల్ కుమార్, మహిళా సంయుక్త కార్యదర్శిగా మర్రిపూడి పిహెచ్‌సి ఎంపిహెచ్‌ఎస్ కె రమాదేవి, కోశాధికారిగా పొదిలి యుపిహెచ్‌సి ఎంపీహెచ్‌ఎస్ కె విజయ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా కాకర్ల ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ కె రవిశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి వి రాధాకృష్ణమూర్తి ప్రకటించారు. ఈ ఎన్నికలకు సహాయ ఎన్నికల అధికారిగా కంభం తాలూకా యూనిట్ కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా సంయుక్త కార్యదర్శి కామ్రేడ్ బి విజయ్ కుమార్ వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన పొదిలి తాలూకా యూనిట్ కార్యవర్గ సభ్యులను జిల్లా అధ్యక్షులు కె శరత్‌బాబు, జిల్లా కార్యదర్శి ఆర్‌సిహెచ్ కృష్ణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కె శివకుమార్, జిల్లా సహాధ్యక్షులు ఎం వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు పి రామాంజనేయులు, మార్కాపురం అధ్యక్ష కార్యదర్శులు బి శ్రీనివాసశాస్త్రి, జె రవికిరణ్, కనిగిరి, దర్శి తాలూకా యూనిట్ అధ్యక్షులు పి రమణారెడ్డి, జి శ్రీనివాసరావు, కార్యదర్శి బిజెఎస్ హెరాల్డ్ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి తాలూకా సంఘం నూతన కార్యవర్గంతో జిల్లా ఎన్జీవో సంఘం నాయకులు

ఉచిత ఇసుక పాలసీ అమలు

(మొదటిపేజీ తరువాయి)

చేయటం సంతోషమని తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయకుమార్, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ టిజె రాజశేఖర్, గెలాక్సీ గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు శిద్దా సుధీర్ కుమార్, ఆర్‌పి రవి, చలువాది బదరీ నారాయణ, అజీమ్, సి.నవీన్ కుమార్ రెడ్డి, శిద్దా హనుమంతరావు, శిద్దా భరత్, శిద్దా పవన్ కుమార్, ఆర్ లక్ష్మీనారాయణ, చంద్రారెడ్డి, చలువాది పార్థసారథి పాల్గొన్నారు.

చదువుకు 'ఆధార్' అడ్డు.!

(మొదటిపేజీ తరువాయి)

చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినప్పుడు పబ్లిసిటీ కోసం ఫొటోలు దిగడం తప్ప విద్యాశాఖ అధికారులు చిత్తశుద్ధితో పని చేయడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి ఆధార్ కార్డులు లేని చిన్నారులకు ఆధార్ కార్డులు ఇప్పించి, బడిలో చేర్పించి విద్య నేర్పించాలని కోరుతున్నారు. ఈ విషయంపై కె.అగ్రహారం పాఠశాల హెచ్‌ఎం షేక్ బాజీని ప్రజాశక్తి వివరణ కోరగా తాను ఇటీవలనే ఈ పాఠశాలలో విధులలో చేరానని, ఈ సమస్య తన దష్టికి రావడంతో వారికి ఆధార్ కార్డులు ఇప్పించి, బడిలో చేర్పించేందుకు కషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓ జె.ప్రసాదరావును వివరణ కోరగా పరిశీలించి వారికి ఆధార్ కార్డులు ఇప్పించి పాఠశాలలో చేర్పించే ఏర్పాటు చేస్తామన్నారు.

20న బైక్ ర్యాలీ, ధర్నా

(మొదటిపేజీ తరువాయి)

వాగ్దానాలు మాటల్లోనే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కార్మికులను బానిసలుగా మార్చే లా 29 కార్మిక చట్టాలను 4, లేబర్ కోడ్స్‌గా అమలుకు తెర తీసిన కేంద్రాన్ని వారు తీవ్రంగా తప్పుపట్టారు. శతాబ్దకాలంగా కార్మిక ఉద్యమాల ద్వారా సాధించిన 8 గంటల పనిదినం, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పని ప్రాంగణాల్లో సౌకర్యాలు, నిరసన-ధర్నా-సమ్మె హక్కులు వంటి కీలక హక్కులన్నీ లేబర్ కోడ్స్‌లో కోల్పోతున్నాయన్నారు. కార్పొరేట్ ప్రోత్సాహక విధానాలతో దేశ కార్మిక-కర్షక వర్గాలను సంక్షోభంలోకి నెట్టడం ప్రభుత్వ ధోరణిగా మారిందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో నవంబర్ 26న ఒంగోలు కర్నూలు రోడ్ బైపాస్ ఫ్లైఓవర్ నుండి ప్రారంభమయ్యే బైక్ ర్యాలీ, ధర్నాను అన్ని వర్గాలు జయప్రదం చేయాలని వారు కోరారు. జిల్లావ్యాప్తంగా జరగబోయే నిరసనల్లో కార్మికులు, ఉద్యోగులు, రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేయాలని నేతలు పిలుపునిచ్చారు.

బోరు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందుల

ఎమ్మెల్యే కందుల చొరవతో...
తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలోని 17వ వార్డులో గత కొన్నేండ్లుగా తాగునీటి సమస్య నెలకొంది. అక్కడి బోరు మరమ్మతులకు గురికాగా దాన్ని పట్టించుకోలేదు. స్థానికులు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో మాట్లాడి బోరు మరమ్మతులు చేయించారు. బోరు నుంచి పైప్‌లైన్ కూడా వేశారు. వినియోగంలోకి వచ్చిన బోరును మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారయణరెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బోడపాడులో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మండలంలోని బోడపాడు గ్రామంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి స్పందన లభించింది. వందలాదిగా పాల్గొన్న రోగులకు వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మహిళల ఆరోగ్య సమస్యలు శ్రావాణి హాస్పటల్ అధినేత డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. సత్యం హాస్పిటల్ అధినేత డాక్టర్ గోపాల్‌రెడ్డి జనరల్ చెకప్‌లు నిర్వహించారు. దంత పరీక్షలు సాయి డెంటల్ వైద్యశాల డాక్టర్ గుంటక నాగసౌమ్య దంత పరీక్షలు నిర్వహించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి, కార్యదర్శి అన్నా రాము ఆధ్వర్యంలో జిల్లా మెడికల్ డైరెక్టర్ కిరణ్, చెన్నకష్ణలు ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి తడికమల్ల శ్రీనివాసరావు, బోడపాడు సర్పంచి ఎం.వి.రమణారెడ్డి, బొగ్గు సుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీ రామాంజనేయులు, గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, జలీల్‌బాష, ఆరవీటి కేశవనారాయణ, లావణ్య, వెంకటేష్, భాగ్యలక్ష్మి, మల్లేశ్వరి, శివప్రసాద్, ఆర్‌కెజె భాస్కర్ బీసా మురళి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రకు గోళ్లవిడిపి విద్యార్థులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని గోళ్లవిడిపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల విహారయాత్రకు ఆదివారం బయలుదేరారు. మండల విద్యాశాఖ అధికారి పి ఆంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 50 మంది విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు బాలు నాయక్, టీచర్ల బృందంతో కలిసి యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఎంఈవో ఆంజనేయులు మాట్లాడుతూ విహారయాత్రలు విద్యార్థులకు విజ్ఞానం, సృజనాత్మకతతో పాటు ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ముఖ్యంగా సైన్స్ పట్ల ఆసక్తి కలిగిస్తాయని తెలిపారు. విద్యార్థులు సింగరకొండ, చారిత్రక భవనాశి చెరువు, మద్దిపాడు ప్రాజెక్ట్, బంగాళాఖాతం కొత్తపట్నం బీచ్ వంటి ప్రదేశాలను సందర్శించినట్టు ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయులు బాలు నాయక్ మాట్లాడుతూ ఈ ప్రయాణం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా విజ్ఞానం, వినోదాన్ని ఒకేసారి అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్ద చెన్నయ్య, ఎస్‌ఎంసి చైర్మన్, ఉపాధ్యాయులు నాగేశ్వరనాయక్, కలామ్, విజయలక్ష్మి, ఆంజనేయులు, యోసోబు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విహార యాత్రకు వెళ్తున్న విద్యార్థులు

ఘనంగా మాదిగల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మాదిగల ఆత్మీయ సమ్మేళనం మన భోజన మహోత్సవ కార్యక్రమం పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో మాదిగ నాయకుడు బంటు క్రిస్టఫర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కొర్రపాలు గురవయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీనియర్ న్యాయవాది బంటు రవి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ ఫలాలు అనుభవించే విధంగా మాదిగలు విద్య, ఉద్యోగం, రాజకీయ, సామాజిక, ఆర్థిక, వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందాలని చెప్పారు. ఇంకా పలువురు నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారే తప్ప పార్టీలలో ప్రాధాన్యత ఇవ్వడం లేదని అన్నారు. యర్రగొండపాలెం ఎస్‌సి రిజర్వేషన్ నియోజకవర్గం అయినప్పటికీ మాదిగల అభివృద్ధి జరగడం లేదని అన్నారు.

ప్రజాశక్తి
సోమవారం 24 నవంబర్ 2025

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్లు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

పట్టించుకోని అధికారులు, పాలకులు

ప్రజాశక్తి-పామూరు

పామూరు నుంచి నెల్లూరు వైపు వరికుంటపాడు వరకు రోడ్డు మార్జిన్లు అధ్వానంగా ఉన్నాయి. మండల ప్రజలు నిత్యం ఈ రోడ్డునే పయనించాలి. ఎదురు వాహనం వస్తే కిందికి దిగి ఎక్కాలంటే టైర్లు పగిలిపోయే పరిస్థితి ఉందని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఎన్నో ప్రమాదాల జరిగి పలువురు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. కోట్ల నిధులు వచ్చాయని, పనులు జరుగుతున్నాయని ప్రచారమే తప్ప పనులు మాత్రం జరగడం లేదు. పట్టణానికి ఇరువైపులా నేషనల్ హైవే వచ్చిన ఈ ఆనందం పట్టణంలో సిఎస్పురం రోడ్డు, కందుకూరు రోడ్డు,

గుంతలు పడి అధ్వానంగా ఉన్న రోడ్డు

నెల్లూరు రోడ్డులో ప్రయాణం ప్రజలకు, వాహనదారులకు నరకం కనిపిస్తోంది. సిఎస్పురం రోడ్డు, కందుకూరు రోడ్డులో లోతైన గుంతలు, నెల్లూరు రోడ్డు సైడ్ గుంతలు, ఉన్నందున ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం పడినా వాహనాలు బురదలో ఇరుక్కుపోతున్నాయి. ఇటీవల ఐద్వా సిపిఎం ఆధ్వర్యంలో వరి నాటి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. వరి నాటిన గుంతల్లో తాత్కాలికంగా స్పందించి మరమతులు చేశారు. పట్టణములు నెల్లూరు రోడ్డు, స్వాగత్ లాడ్జి వద్ద ఇటీవల వర్షానికి నీళ్ల నిలవడంతో కాలువలు తీశారు. తరువాత వదిలేయడంతో వాహన రాకపోకలు, వ్యాపారస్తులు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

లోకల్ రోడ్డు అభివృద్ధి చేయాలి

- సిపిఎం మండల కార్యదర్శి షేక్ ఖాదర్ భాషా

పట్టణం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని లోకల్ రోడ్లను వెంటనే ఎస్టిమేషన్ వేసి మరమ్మతులు పూర్తి చేయాలి. పామూరు నుంచి ప్రజలు పట్టణానికి ఉపాధి కోసం వలస వస్తున్నారు. వాహనాల రద్దీ పెరిగింది. రోడ్ల అభివృద్ధి జరగలేదు. ఇటీవల రోడ్లు ఆక్రమణలు తొలగించి వెడల్పు చేశారు. తరువాత వదిలేయడంతో గతం లాగానే వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కోసుకుపోయిన రోడ్డు మార్జిన్లు

సీఎస్‌పురం రూరల్ : మండలంలోని డిజిపేట సమీపంలో గచ్చకాయ గుంతలు ప్రాంతంలో రోడ్డు మార్జిన్లు

డీజీపేట సమీపంలో ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్

ప్రమాదకరంగా ఉండి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మైదుకూరు సింగరాయకొండ 167బి జాతీయ రహదారి గా ఉన్న ఈ ప్రాంతంలో అటవీ శాఖ వారి అనుమతులు రాలేదంటూ దాదాపు 400 మీటర్ల మేర జాతీయ రహదారి నిర్మాణం పనులు చేపట్టలేదు. ఈ రోడ్డు వెంట భారీ వాహనాలు తిరుగుతుండడంతో రోడ్డు మొత్తం ధ్వంసం అయిపోయింది. ఇటీవల కూర్చున్న వర్షాల కారణంగా రోడ్డు మార్జిన్లు కోసుకుపోయి ప్రమాద భరితంగా తయారయ్యాయి. భారీ వాహనం ఎదురుగా వస్తే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రాత్రి వేళలో అయితే తమ పరిస్థితి మరి దారుణంగా ఉంటుందని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్లను సరి చేయించి ఇబ్బందులు చేర్చాలని వాహనదారులు కోరుతున్నారు.

పొగాకు కూలీల రక్షణకు చట్టం చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-మద్దిపాడు

పచ్చాకు ముఠా కూలీల రక్షణకు చట్టం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని వెలుగు ఆఫీస్ వద్ద పచ్చాకు ముఠామేస్త్రిలు, కూలీలు, టోకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో 70 వేల మంది పైగా ముఠా కూలీలు నాలుగు నెలల పాటు ఆకు కొట్టి, అల్లి, క్యూరింగ్ చేసి, బేళ్ళు కట్టే వరకు వివిధ రకాల పనులు చేస్తున్నారని తెలిపారు. పొగాకు ఎగుమతి ద్వారా కేంద్ర ప్రభుత్వానికి గత

మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

సంవత్సరం 16,786 కోట్లు విదేశీ మార్గద్రవ్యం లభించిందన్నారు. ప్రభుత్వాలకు ఇంత ఆదాయం రావడానికి కారకులైన పొగాకు ముఠా కూలీలకు ఎటువంటి రక్షణ లేకపోయిందని అన్నారు. యాక్సిడెంట్లో కాళ్లు, చేతులు విరిగి దెబ్బతిన్న కుటుంబాల జీవితం అస్తవ్యస్తంగా మారుతున్నది అన్నారు. అటువంటి పరిస్థితుల్లో రైతు దయాదాక్షణ్యం తప్ప ప్రభుత్వం నుంచి ఎటువంటి రక్షణ లేకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వీరి శ్రమను దృష్టిలో ఉంచుకొని ఒక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో పొగాకు బార్నీ ముఠా కూలీల పనులు ప్రతి ఏడాది జరుగుతున్నాయని అన్నారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన భూరగ శ్రీను, ఏ.హరిబాబు, ఎం.అంజయ్య, టి.మాలకొండయ్య, ఎస్ అశోక్, ఏ.శ్రీనివాసరావు, కె. బుజ్జిబాబు, పోకూరి హనుమంతరావు, డి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో ట్రాఫిక్ ఇక్కట్లు

రోడ్డుపైనే నిలుపుతున్న వాహనాలు -ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-కొండపి

మండల కేంద్రమైన కొండపిలో ట్రాఫిక్ ఇక్కట్లు రోజురోజుకు పెరుగుతున్నాయి. ప్రతి రోజు రాత్రి 7 గంటల ప్రాంతంలో కొండపి నుంచి అనకర్లపూడి వెళ్లే రహదారిలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. దాంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపి వేయడంతో ప్రయాణించే వాహనదారులకు ఎదురు వాహనాలు అడ్డు రావడంతో తప్పించే అవకాశం లేకపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు కూడా బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణికుల కోసం నడి రోడ్డులో బస్సులను నిలుపుతుండటంతో వాహనాలను క్రాస్ చేయటానికి ఇబ్బందులు ఎదుర్కొని ట్రాఫిక్ అంతరాయం కూడా కలుగుతుందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. సాయంత్రం వేళల్లో ప్రైవేట్

ట్రాఫిక్‌లో నిలిచిపోయిన వాహనాలు

పాఠశాల బస్సులు, కళాశాల బస్సులు విద్యార్థులను దించే సమయాలలో కూడా ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని, గాంధీ బొమ్మ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వైపు సాయంత్రం వేళలో వాహనాలను రోడ్డుపై నిలపడం వలన ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. అధికారుల స్పందించి రోడ్లమీద వాహనాలు నిలిపే వారిపై చర్యలు తీసుకోని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని వాహనదారులు కోరుకుంటున్నారు.

మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన ఫ్యాక్టరీ అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-చీమకుర్తి

రాష్ట్ర భూగర్భ గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్రను గెలాక్సీ గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం ఒంగోలులో జిల్లా మైనింగ్ కార్యాలయం శంకుస్థాపన చేయడానికి విచ్చేసిన మంత్రి కొల్లు రవీంద్రను కలిసి పుష్పగుచ్ఛి అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఒక మీటర్ ముడి రాయి కట్ చేస్తే గతంలో 350 అడుగులకు అనుమతి ఇచ్చే వారని, ప్రస్తుతం పెరిగిన సాంకేతిక మిషనరీల వలన ఉత్పత్తి పెరిగిందని, 450 అడుగుల ఫినిషింగ్ మెటీరియల్‌కు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాయల్టీ వసూలు ఏఎంఆర్ సంస్థకు అప్పగించాక వచ్చిన పరిస్థితిని చక్కదిద్దే విధంగా చొరవ చూపాలని కోరారు. స్పందించిన మంత్రి కొల్లు రవీంద్ర తగు చర్యలు తీసుకుంటామని, సమస్యలన్నీ త్వరలోనే పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్‌ల నాయకులు కాట్రగడ్డ రమణయ్య మార్వెల్ బుజ్జి, ఎర్రగుంట్ల శ్రీనివాసరావు, ఇంటూరి భవాని ప్రసాదు, నన్నూరి సుబ్బారావు, మలినేని వెంకటేశ్వర్లు, లగడపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కొల్లు రవీంద్రతో నాయకులు

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ

యువతి మృతి.. ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-జరుగుమల్లి

శాంతి (ఫైల్)

ముందు వెళ్తున్న బైక్‌ని లారీ ఢీకొన్న ప్రమాదంలో యువతి మృతి చెందగా మరో వ్యక్తి గాయపడ్డారు. ఈ సంఘటన మండలంలోని బిట్రగుంట దగ్గర జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో ఐసీయూలో పని చేస్తున్న ఉదయ్ కుమార్, శాంతి(30)లు జరుగుమల్లిలోని ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లి తిరిగి ఒంగోలు వస్తున్నారు. జరుగుమల్లి నుంచి జాతీయ రహదారిపైకి రాగానే వీరి బైక్‌ను వెనుక నుండి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న శాంతి పైకి లారీ ఎక్కటంతో అక్కడికక్కడే మృతి చెందగా ఉదయ్ కుమార్‌కు గాయాలయ్యాయి. జరుగుమల్లి ఎస్ఐ మహేంద్ర, సింగరాయకొండ సిఐ చావా హాజరత్తయ్యలు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం తీవ్ర గాయాలైన ఉదయ్‌కుమార్‌ని అంబులెన్సులో ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. శాంతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఎస్సై మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు యువకుడు మృతి

సురేష్ (ఫైల్)

ప్రజాశక్తి-పొదిలి : మండలంలోని అక్కచెరువు గ్రామానికి చెందిన యువకుడు భోగాని సురేష్(25) పాముకాటుకు గురై మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అయ్యప్ప మాలలో ఉన్న సురేష్ తన బంధువుతో కలిసి బుధవారం సిఎస్ పురం మండలం భైరవకోనకు వెళ్లారు. అక్కడ పూజా కార్యక్రమాలు ముగించుకొని తిరిగి ప్రయాణంలో అదే రోజు రాత్రి కనిగిరి మండలం చల్లగిరిగల వద్ద ఉన్న శివాలయంలో బస చేసిన సమయంలో పాము కాటుకు గురయ్యాడు. వెంటనే గుర్తించిన స్థానికులు సురేష్‌ను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం ఉదయం మృతి చెందారు. కనిగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకురానున్నారు.

అనుమానాస్పద స్థితిలో సచివాలయ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

అనిల్ కుమార్ (ఫైల్)

సచివాలయ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన త్రిపురాంతకం మండలం దుపాడులో జరిగింది. గ్రామానికి చెందిన ముక్తిపూడి అనిల్‌కుమార్(36) మృతదేహం హసనాపురం గ్రామ సమీపంలోని సాగర్ కాలువ వద్ద ఆదివారం మధ్యాహ్నం లభ్యమయింది. మృతుడు దొనకొండ మండలం పోలేపల్లి గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. త్రిపురాంతకం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై భర్త దాడి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు : తాగిన మత్తులో భార్యపై భర్త దాడి చేసిన సంఘటన మండల కేంద్రమైన నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్ సమీపంలో జరిగింది. స్థానికంగా నివాసం ఉంటున్న గుర్రపుశాల హైమావతిని ఆమె భర్త వీరరాఘవులు తాగిన మైకంలో కత్తితో దాడి చేసి పరారయ్యాడు. రక్తపు మరకలతో కుప్పకూలిన హైమావతిని స్థానికులు చూసి 108కు సమాచారం ఇవ్వడంతో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

ఎంఈవో హరిబాబుకు నివాళి

ప్రజాశక్తి-పొన్నలూరు : పొన్నలూరు ఉన్నత పాఠశాలలో ఎంఈఓ-2గా పని చేసిన హరిబాబు గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం తోటి ఉపాధ్యాయులు, ఎంఈఓలు, డిఇఓ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీఈవో ఏ కిరణ్ కుమార్ మాట్లాడుతూ హరిబాబు వృత్తిరీత్యా మండలంలో అనేక సేవలు చేశారని, అందరితో స్నేహభావంగా మెలిగేరని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ చంద్రశేఖర మౌళి, ఎంఈఓ రవిచంద్రబాబు, ప్రధానోపాధ్యాయుడు వై.వెంకటేశ్వరరావు, టంగుటూరు ఎంఈఓలు తన్నీరు బాలాజీ, మల్లికార్జున పాల్గొన్నారు.

రైతు సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన

- 26న రైతు వ్యతిరేక విధానాలపై గ్రామాల్లో నిరసన - కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఈనెల 26న సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల రామ కోటేశ్వరరావు కోరారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో రైతు సంఘ సమా వేశం ఆదివారం నిర్వహించారు. రైతు సంఘం మండల అధ్యక్షులు బాచిన కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో నిర్వహించిన భూ సర్వే తప్పులతడకగా ఉందని అన్నారు. ఈ భూ సర్వే ద్వారా ఇచ్చిన భూమి హక్కు పత్రాలు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు రద్దు చేశారని అన్నారు. భూ హక్కు పత్రాలు రద్దు చేసినప్పటికీ వెబ్ ల్యాండ్‌లో సాంకేతికంగా తప్పులు అలానే ఉన్నాయని పేర్కొన్నారు. కొంత మంది రైతులకు భూమి తక్కువ చూపించటం, ఒకరి భూమి సర్వే నెంబర్‌లో వేరొకరి భూమి చూపించటం, కొంత మందికి అదనంగా భూమి చూపించటం, కొంత మంది పేర్ల బదులు వేరే వారి పేర్లు చూపించటం వంటి తప్పులు ఉన్నాయని అన్నారు. ఈ తప్పులకు గత ప్రభుత్వంలో అప్పటి రెవిన్యూ సిబ్బంది కారణమని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులకు ఈ రెవెన్యూ సమస్యలు ఒక ఆయుధంలా ప్రచారంలో ఉపయోగించు కుని ఎన్నికల్లో లబ్ధి పొందా రని తెలిపారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో భూ హక్కు పత్రాలు రద్దు చేసినప్పటికీ సాంకేతికంగా వెబ్ లాండ్, ముటేషన్, ఆన్లైన్లో ఆ పొరపాట్లు అలానే సరిదిద్దకుండా ఉన్నాయని తెలిపారు. దీంతో భూ రీసర్వే సమస్యలపై రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆ తప్పులు సరిచేయించు కునేం దుకు కార్యాలయాల చుట్టూ రైతులు తిరుగుతున్నప్పటికీ సర్వేయర్లు, విఆర్‌ఒలు రైతుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడుతు న్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ సర్వే నిర్వహించిన గ్రామాల్లో మ్యూవిటేషన్, వెబ్ల్యాండ్ ప్రక్రియ సహా రద్దు చేసి ఆన్లైన్లో మళ్లీ నూతనంగా సర్వే చేసి ఏ రైతుకు సంబంధించిన పొలం హద్దులు, కొలతలు రైతులనే పిలిచి క్షేత్రస్థాయిలో సరి చేయాలని అన్నారు. ఏ సర్వే నెంబర్‌కు ఆ సర్వే నెంబర్లు సబ్ డివిజన్ చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. సమస్యకు పరిష్కార మార్గం పక్కాగా ఉన్నప్ప టికీ రెవెన్యూ శాఖ ఆ దిశలో పనిచేయడం లేదని ఆరోపిం చారు. పరిస్థితి ఇలానే కొనసాగితే గత వైసిపి ప్రభుత్వానికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి పడుతుందని అన్నారు. డిఎపి, యూరియా సమస్య రైతులకు అలానే ఉందని అన్నారు. డిఎపి బస్తాకు రూ.100, యూరియా బస్తాకు రూ.30 నుంచి రూ.40 అదనంగా వ్యాపారులు వసూలు చేస్తున్నారని అన్నారు. సహకార సంఘాలు, పిఎసిఎస్‌లకు ఎరువుల కోటాలో 70శాతం కేటాయించి 30శాతం ప్రైవేటు వ్యాపారులకు కేటాయించామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదన్నారు. సహకార సంఘాల కూడా దూర ప్రాంతాల నుంచి ఎరువులు తెస్తున్నామని కంపెనీలకు అదనంగా చెల్లించవలసి వస్తుందని బస్తాకు డిఎపి బస్తాకు రూ.50, యూరియాకు రూ.20 నుంచి రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారని అన్నారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన పొగాకుకు రూ.50 కోట్లపైన రైతులకు బకాయిలు ఉన్నాయని తెలిపారు. నెలలు గడుస్తున్న రైతుల ఖాతాలో జమ కాలేదన్నారు. పొగాకు నిల్వలు గ్రామాల్లో ఇంకా అలానే పేరుకుపోయి ఉన్నాయని తెలిపారు. చివరి ఆకు వరకు కొంటామని హామీలు ఇచ్చిన ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. రైతుల వద్ద మిగిలి ఉన్న పొగాకు వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రేపటి నుంచి గ్రామాల్లో కిసాన్ మోర్చా పిలుపు మేరకు నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేయను న్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కాపాడు కోవడా నికి, రైతులను రక్షించుకోవటానికి అవసరమైన ఎనిమిది డిమాండ్లతో కూడిన ఈ కరపత్రాలు గ్రామాల్లో రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రం గోవిందరెడ్డి, సిహెచ్ శ్రీనివాసరావు, బి గోవిందు, ఎన్ వెంకట్రావు, అనేం ఆదియ, రంగయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రైతు నాయకులు

నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకించండి

ప్రజాశక్తి - పర్చూరు

కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను అమలు నిలిపివేయాలని సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక బొమ్మల సెంటర్లో నిరసన ఆదివారం తెలిపారు. పారిశ్రామిక వర్గాలకు రాయితీ ఇవ్వడానికి రాష్ట్రంలో చంద్రబాబు 12 గంటల పని విధానం అమర యోజన, విశాఖ ఉక్కు కార్మిక పోరాటాన్ని ఎన్నికలకు ముందు సపోర్ట్ చేసి ఇప్పుడు తెల్ల ఏనుగుతో పోల్చడాన్ని తీవ్రంగా ఖండించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని ఎన్నికలకు ముందు నినాదాలు ఇచ్చిన తెలుగుదేశం, జనసేన పార్టీలు అధికారం వచ్చాక ఇప్పుడు కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేయడం దారుణమని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని అన్నారు. కార్మిక చట్టాలు అన్నిటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలు ఏకపక్షంగా అమలు చేయటానికి పూనుకుంటే కార్మికుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పి కొండయ్య, పర్చూరు నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, టి పేతురు, సిఐటియు నాయకులు ఎం డేవిడ్, బండారు చినదాసు, పోతురాజు, ఆదియ్య, గంగయ్య పాల్గొన్నారు.

మచ్చ రామాంజనేయులును సన్మానిస్తున్న దృశ్యం

రామాంజనేయులుకు సన్మానం

ప్రజాశక్తి - పంగులూరు

వడ్రంగి, శిల్పకళా రంగంలో విశిష్ట కృషి చేసినందుకు తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం మండలం లోని కళ్ళంవారిపాలెంకు చెందిన మచ్చ రామాంజనేయులు అందుకున్నారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ ఠాగూర్ గ్రంథాలయం వేదికగా మండలి వెంకటకృష్ణారావు శత జయంతి 2025- 2026 సందర్భంగా అంతర్జాతీయ తెలుగు భాషా సాహితీ సాంస్కృతిక వేదిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయనకు ఈ పురస్కారం అందజేశారు. ఈ పురస్కారాన్ని పోలోజు రాజ్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో పంతుల వెంకటేశ్వరరావు, శారదా స్రవంతి అధ్యక్షులు పోలవరపు కోటేశ్వరరావు, కళా స్రవంతి కార్యదర్శి నారాయణరావు, పంగులూరు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మచ్చ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి తక్కెళ్ళపాటి నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

మార్చి 16 నుండి పదో తరగతి పరీక్షలు

ప్రజాశక్తి - బాపట్ల

డిఇఓ ఎస్ పురుషోత్తం

వచ్చే ఏడాది మార్చి 16 నుండి జరిగే 10వ తరగతి పరీక్షల షెడ్యూల్‌ను డిఇఒ ఎస్ పురుషోత్తం ప్రకటించారు. మార్చి 16 నుండి ఏప్రిల్ 01 వరకు పరీక్షల తేదీలు వివరిం చారు. పరీక్షలు ఉదయం 9:30 నుండి 12:45 వరకు జరుగు తాయని తెలిపారు. 2026 మార్చి 16న మొదటి బాష తెలుగు, 18న రెండవ బాష హిందీ, 20న ఆంగ్లము, 23న గణితం, 25న భౌతిక శాస్త్రం, 28న జంతు శాస్త్రం, 30న సాంఘిక శాస్త్రం, 31న ఓఎస్ ఎస్సి ప్రధాన బాష పేపర్1, ఏప్రిల్ 1న ఓఎస్ఎస్‌సి ప్రధాన బాష పేపర్ 2 పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్ష, పరీక్షకు మధ్య కొంత విరామం వచ్చేలా ప్రణాళిక తయారు చేసినట్లు తెలిపారు. 10వ తరగతి పరీక్షలకు బాగా చదివి మంచి ఉత్తీర్ణ శాతంతో జిల్లాకు మొదటి స్థానం వచ్చేలా కృషి చేయాలని కోరారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - సంతమాగులూరు

అధ్యక్ష, కార్యదర్శులు వై పోతురాజు, ఎం నాగేశ్వరరావు

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షులుగా యలగాల పోతురాజు, ప్రధాన కార్యదర్శిగా మక్కెన నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. ఎన్నికలను పి రామాంజనేయులు పరిశీలించి నూతన కార్యవర్గ సభ్యులచే ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా ఉర్దూ విభాగంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు పొందిన ఎస్‌కె రెహనాను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. నూతన కార్యవర్గంలో ఎన్నికైన వారు గతంలో పని చేసిన వారినే తిరిగి ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీపతి వెంకట సుబ్బయ్య, పరిమి కోటేశ్వరరావు, కారసాని వెంకటరెడ్డి, జి పుల్లారావు, పి వలీఖాన్, నారు వరలక్ష్మి, హనుమంతరావు, బల్లికురవ యుటిఎఫ్ నాయకులు భాస్కర్, పెద్దబ్బాయి పాల్గొన్నారు.

విద్యతోనే మహిళలకు సామాజిక భద్రత

ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు కె శ్రీదేవి

ప్రజాశక్తి - బాపట్ల

చదువు ద్వారానే మహిళలకు సామాజిక భద్రత వస్తుందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర అధ్యక్షురాలు కె శ్రీదేవి అన్నారు. నవం బర్ 25న హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సాంఘిక సంక్షేమం కళాశాల బాలికల వసతి గృహంలో హింసను వ్యతిరేకిద్దాం, సమానత్వం సాధిద్దాం అనే అంశంపై ఐద్వా జిల్లా కార్యదర్శి టి సుభాషిణి అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. స్వతంత్ర భారతదేశంలో మహిళలు, విద్యార్థినులపై రోజు రోజుకు హింస పెరిగి పోతుందని అన్నారు. దాన్ని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయని అన్నారు. మహిళలపై జరిగే హింసకు వ్యతిరేకంగా మహిళలు పోరాటాల్లో పాల్గొనాలని అన్నారు. దాడుల నివారణకు ప్రత్యేక చట్టాలు చేయాలని అన్నారు. బాలికా విద్యకు ప్రోత్సహం తక్కువగా ఉందన్నారు. చదువు ద్వారానే సమానత్వం సాధ్యమని అన్నారు. కేరళ రాష్ట్రంలో మహిళల్లో అక్షరాస్యత నూరుశాతం ఉందన్నారు. కేరళను ఆదర్శంగా అన్ని రాష్ట్రాలు ప్రయత్నం చేసి బాలికల విద్య ప్రోత్సహించాలని అన్నారు. మహిళ, పురుషుడనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు సమ భావం కలిగి ఉండాలని అన్నారు. మహిళలపై అత్యాచారాలు జరిగినప్పుడు, ఎన్నికల సమయంలో మాత్రమే మహిళా చట్టాలు గురించి మాట్లాడుతున్నారని అన్నారు. ఆచరణలో మహిళాభివృద్ధికి కృషి చేసే విధంగా ఉండాలని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు నేపథ్యంలో మహిళల ప్రయాణం పెరిగిందని ప్రభుత్వాలు చెబుతున్నాయని, తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. మద్యం, బెల్ట్ షాపులు ప్రోత్సహిస్తుందని అన్నారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు నష్టపోతున్నాయని అన్నారు. దీనివల్ల మహిళలకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, వసతి గృహ అధికారిణి రాహేలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వ రాష్ట్ర కార్యదర్శి శ్రీదేవి

శంకుస్థాపన చేస్తున్న అనగాని శివప్రసాద్

తాగునీరు కొరత లేకుండా చూస్తాం

ప్రజాశక్తి - రేపల్లె

నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ తెలిపారు. మండలంలోని మోర్లవారి పాలెంలో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ట్యాంకులు లేని గ్రామాలను ఎంపిక చేసి అక్కడ మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గ్రామ సర్పంచ్ యార్లగడ్డ లక్ష్మీ సోమశేఖర్ మాట్లాడుతూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో శివప్రసాద్ సహకారంతో పంచా యితీలో సిసి రోడ్లు, వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపడుతు న్నామని అన్నారు. గ్రామం అభివృద్ధికి వారు అందిస్తున్న కృషిని ప్రజలు గుర్తుంచు కుంటారని తెలిపారు. కార్యక్ర మంలో తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇఇ పంతాని రాంకుమార్, తెలుగు యువత అధ్యక్షులు కొలసాని రాము, ఎఒ పిఆర్‌డి ప్రసాద్ పాల్గొన్నారు.

దుద్దుకూరులో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

శ్రీలక్ష్మమ్మ (90)

మండలంలోని దుద్దుకూరుకు చెందిన కటారి శ్రీలక్ష్మమ్మ (90) వృద్ధాప్యం రీత్యా ఆదివారం మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులు ఆంజనేయులు, తిరుమలరావు, భాస్కరరావు ఆమె కార్నియాను దానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. గుంటూరు శంకర నేత్రాలయం వైద్యులు వచ్చి కార్నియా సేకరించారు. కుటుంబ సభ్యులకు, వైద్యులతో పాటు రోటరీ సభ్యులు సోమేపల్లి రామమో హనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, అధ్యక్ష, కార్యదర్శి, కోశాధి కారులు బలగం కోటేశ్వరరావు, అలవల రాఘవరెడ్డి, గోరంట్ల నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

ఎన్‌సీసీ డే వేడుకల్లో పాల్గొన్న సూర్యకళ్యాణ్ చక్రవర్తి

'క్విస్' కళాశాలలో ఎన్‌సీసీ డే వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఎన్‌సిసి డే సందర్భంగా క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమనూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమనూరి శ్రీ గాయత్రిదేవి శుభాకాంక్షలు తెలియజేశారు. క్విస్ కళాశాలలో 80 మంది కేడెట్ లతో 34వ బెటాలియన్ ఒంగోలు విభాగం కింద ఎన్ సీసీ యూనిట్ ఉందని అన్నారు. రిటైర్డ్ ఆర్మీ అధికారితో కేడెట్ లకి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. క్రమశిక్షణ, దేశభక్తి , ఐక్యత తో విద్యార్థులు ఉన్నత విలువలతో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా శిక్షణ అందించటం ద్వారా వరుసగా రెండు సార్లు జాతీయస్థాయి తలసేనిక క్యాంపునకు ఎంపికయ్యారని చెప్పారు. పిఆర్‌ఇ ఆర్‌డిసి, రైఫిల్ షూటింగ్, ఆబ్స్టకల్ ట్రైనింగ్‌లలో ఉత్తమ ప్రతిభ చూపి, వీటితో పాటు పలు సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజ సేవలో ముందు ఉన్న క్విస్ ఎన్.సి.సి క్యాడెట్స్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి హనుమంతరావు అభినందించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలపై ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు అన్ని శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ సమీక్ష నిర్వహించడం జరుగుతుందని, అనంతరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తో పాటుగా ప్రతి రెవెన్యూ డివిజన్‌లో మరియు మండల తహశీల్దార్ల కార్యాలయాలలో తహశీల్దార్లు, ఎంపీడీఓలు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులు అందజేసిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునని చెప్పారు. మీకోసం.ఏపీ.జీవో వి.ఇన్ వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని, పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరు కావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంట వరకు ముంగమూరు రోడ్డు, జెడ్ పి కాలనీ,కొత్త డొంక, జర్నలిస్ట్ కాలనీ, సుబ్బయ్య నగర్, మర్రిచెట్టు కాలనీ, ప్రగతి నగర్ గాంధీనగర్ ఎక్స్టెన్షన్, శివప్రసాద్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్కు అంతరాయం ఉంటుందని టౌన్ విద్యుత్ డి.ఇ.ఇ. కె.వి.పి. రంగారావు తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రజాప్రతినిధులు

ఘనంగా నిశ్చితార్థ వేడుక..

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నగరంలోని సాయి ఐటిఐ ఫంక్షన్ హాలులో ప్రముఖ పారిశ్రామిక వేత్త మండవ మురళీకృష్ణ కుమారుడు సాయి సుందర్, మాకినేని హరి బాబు కుమార్తె డాక్టర్ వర్షిత నిశ్చితార్థ వేడుక ఆదివారం నాడు ఘనంగా నిర్వహించారు. మంత్రి స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ఉగ్ర నరసింహారెడ్డి, విజయ్‌కుమార్, మార్కెట్ బోర్డు చైర్మన్ సత్య తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

హింసకు వ్యతిరేకంగా ప్రచార ఉద్యమం

ఐద్వా పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రోజురోజుకూ మహిళలపై, చిన్నారులపై పెరుగుతున్న దాడులు, లైంగిక దాడులను మహిళా సమాజం ఎదుర్కోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. ఆదివారం నాడు స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం లో జిల్లా అధ్యక్షురాలు యస్ డి షర్మిల అధ్యక్షతన జరిగిన విస్తృత సమావేశంలో రమాదేవి మాట్లాడారు. నవంబర్ 25న అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినోత్సవం నుంచి డిసెంబర్ 10 మానవ హక్కుల దినోత్సవం వరకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగే హింస వ్యతిరేక ప్రచార ఉద్యమం విజయవంతం చేయాలని ఆమె కోరారు. రాష్ట్రంలో, దేశంలో మహిళల భద్రత పరిస్థితి రోజు రోజుకూ దారుణంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నిమిషం ఎక్కడో ఒకచోట మహిళలు, చిన్నారులపై దారుణం జరుగుతున్నదని, దానికి కారణం ప్రభుత్వాల నిర్లక్ష్యమని విమర్శించారు. ఇటువంటి నేరాలపై వేగవంతమైన విచారణ జరపకపోవడం, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను పెంచకపోవడం, వాస్తవ నేరస్తులను కఠినంగా శిక్షించడంలో ప్రభుత్వం విఫలం అవుతోందని చెప్పారు. రాష్ట్రం మద్యం, మత్తు పదార్థాల కేంద్రంగా మారిందని, అవే మహిళలపై దాడులు పెరగడానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. మద్య నిషేధంతో పాటు మత్తు పదార్థాలపై సమగ్ర నియంత్రణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హింసను అరికట్టాలంటే ప్రజాస్వామ్య శక్తులంతా కలిసి ఉద్యమాన్ని బలపరచాల్సిన అవసరముందని రమాదేవి స్పష్టం చేశారు. మహిళలు, యువత, ప్రజాసంఘాలు ఈ ప్రచార కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని, సమాజంలో మహిళల భద్రత, గౌరవం కోసం గొంతెత్తాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు జి ఆదిలక్ష్మి, యస్‌కె నాగూర్, కె ప్రసన్న, కె రాజేశ్వరి, బి పద్మ, కె ధనలక్ష్మి, పి రత్నం, యస్ డి ఖాదరున్నీసా, పి రత్తమ్మ, ఎస్‌కె మస్తాన్ బీ, పి ప్రేమలత, రమీజ, ఎస్‌డి అమీరున్నీస్సా, ప్రమీల, కె శాంతకుమారి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి

బలవన్మరణ బాధితుల్ని

ఎస్‌సి కమిషన్ పరామర్శించాలి

దళిత హక్కుల నేత నీలం నాగేంద్రరావు డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బండ్లమూడి దాడి ఘటనలో గాయపడిన మాదిగలను పరామర్శించేందుకు జిల్లాకు వస్తున్న ఎస్‌సి కమిషన్ చైర్మన్ జవహర్ జిల్లాలోని బలవన్మరణ మతుల కుటుంబాలను పరామర్శించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని తన కార్యాలయంలో సమావేశంలో నాగేంద్ర మాట్లాడుతూ చీమకుర్తి మండలం బండ్లమూడి గ్రామంలో మాదిగలపై అనేకసార్లు పెత్తందార్లు దాడి చేశారన్నారు. బాధిత మాదిగలను పరామర్శించేందుకు జిల్లాకు వస్తున్న ఎస్‌సి కమిషన్ చైర్మన్ జవహర్ దగ్గర ఇతర కులాల వేధింపుల వల్ల ఆత్మహత్య చేసుకున్న మాదిగ యువకుల సమాచారం లేదా.? అని ప్రశ్నించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా అద్దంకి పోలీస్ స్టేషన్ పరిధిలో 2024 అక్టోబర్ 27న సెల్ఫీ వీడియో పెట్టి ఆత్మహత్య చేసుకున్న మాదిగ యువకుడు చింతల శ్రీను కేసులో నిందితులను ఇంతవరకూ అరెస్టు చేయలేదన్నారు. చింతల శ్రీను మాదిగను పరామర్శించాల్సిన బాధ్యత ఎస్‌సి కమిషన్‌కు లేదా? అని ప్రశ్నించారు. కలెక్టర్ రాజాబాబు బండ్లమూడి మాదిగలకు అండగా నిలిచినట్లే, ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ కూడా దేగరమూడి, చిన్న జమ్ములమడక, ఉప్పుగుండూరు, కనిగిరి సందర్శించి బాధితులకు అండగా నిలవాలని నాగేంద్ర డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

రాజకీయ లబ్ధి కోసం మత విద్వేషాలు..

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాజకీయ లబ్ధి కోసం దేశవ్యాప్తంగా బిజెపి మత వైషమ్యాలను రెచ్చగొట్టే విధానాలకు పాల్పడుతున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథ్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం నాడు ఒంగోలులో ఆ పార్టీ నాయకులు ఆర్ వెంకటరావు అధ్యక్షతన జరిగిన సిపిఐ ప్రాంత వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో బిజెపి ఎప్పుడూ ప్రజల పక్షాన నిలవలేదని ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను అమలు చేస్తోందన్నారు. స్వాతంత్ర పోరాటం నుండి ప్రజా ఉద్యమాల వరకూ సిపిఐ కీలక పాత్ర పోషించినట్లు గుర్తుచేశారు. లౌకికవాదమే దేశాన్ని ఐక్యంగా నిలబెట్టిందని, హిందూ మతానికి ప్రమాదం బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ నుంచే ఉందని ఆయన స్పష్టం చేశారు. శతాబ్దాలుగా హిందూ-ముస్లిం సామరస్యాన్ని ధ్వంసం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, లేని సమస్యలు సృష్టించి మత ఘర్షణలకు మార్గం చూపుతున్నట్లు ఆరోపించారు. కేంద్ర బిజెపి పాలనపై ఆయన తీవ్రంగా విమర్శలు చేశారు. పదేళ్ల పాలనలో ఒక్క హామీ నెరవేర్చలేదని, ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాల హామీ గాలిలో కలిసిపోయిందని అన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనాలకే కట్టుబడి ప్రభుత్వ రంగాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ప్రజలను ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి అణగదొక్కే ధోరణి పెరిగిందని మండిపడ్డారు. ఖమ్మంలో జరగనున్న సిపిఐ వందేళ్ల వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

26న నిరసన

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను పరిష్కరించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక-రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 26న ఒంగోలులో నిర్వహించనున్న నిరసన, ప్రదర్శనలకు విశాల మద్దతు తెలపాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నాడు మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రైతు, కౌలు రైతుల, వ్యవసాయ కార్మికుల రుణాలను సమగ్రంగా మాఫీ చేసి, రైతులకు వడ్డీ లేని రుణాలను అందించాలని డిమాండ్ చేశారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల దోపిడీని నిరోధించడానికి కట్టడి చర్యలు అవసరమని సూచించారు. రైతు సంఘాల-ట్రేడ్ యూనియన్ల సంయుక్త పిలుపుతో జరగనున్న ఈ నిరసన కార్యక్రమాన్ని రైతు, కౌలు రైతు, కార్మిక, ప్రజా సంఘాలు ఆందోళనలను జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

వెనుకబడిన వర్గాల అభ్యర్థులు సివిల్ సర్వీసుల్లో అవకాశాలు పొందేందుకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాల్లో భాగంగా, సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు యస్ నిర్మలాజ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లాకు చెందిన బిసి, ఎస్సీ,ఎస్ టి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చుని తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించవలసి ఉంటుందన్నారు. దరఖాస్తులు స్వీకరించిన అభ్యర్థులకు డిసెంబర్ 5న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించబడుతుందన్నారు. స్క్రీనింగ్‌లో అర్హత సాధించిన వారికి డిసెంబర్ 10 నుంచి విజయవాడ గొల్లపూడిలోని ఏపీబీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమవనున్నాయని వివరించారు. దరఖాస్తుతో పాటు 10, ఇంటర్, డిగ్రీ మార్కుల నకళ్లు, స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్ నకలు, రెండు పాస్‌పోర్ట్ ఫోటోలు జతచేయాలని సూచించారు. దరఖాస్తులను ఒంగోలు కలెక్టరేట్ ఎదుట గవర్నమెంట్ ఆఫీస్ కాంప్లెక్స్‌లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సమర్పించవచ్చుని చెప్పారు. ఇతర వివరాలకు 08592-231232, 9989285530, 8985090926 నంబర్లను సంప్రదించవచ్చుని తెలిపారు.

ఖాదర్‌బాబా మృతికి ఎపిడబ్ల్యుజెఎఫ్ సంతాపం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బేస్తవారిపేట మండల ఆంధ్రప్రభ విలేకరి షేక్ ఖాదర్‌బాబా(49) మృతికి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ చిన్న కరీముల్లా, దాసరి సునీల్ సంతాపం తెలియజేశారు. సుదీర్ఘకాలం వార్త విలేకరిగా పనిచేసిన ఆయన ప్రస్తుతం ఆంధ్రప్రభలో కొనసాగుతున్నారన్నారు. షేక్ ఖాదర్ బాబా అందరితో కలుపుగోలుగా ఉంటారని, మంచి జర్నలిస్టుగా గుర్తింపు పొందారన్నారు. ఆయన అకాల మరణం ఎంతో బాధాకరమని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. షేక్ ఖాదర్ బాబా కుటుంబానికి ఎపిడబ్ల్యుజెఎఫ్ అండగా ఉంటుందని వారు తెలియజేశారు.

విద్యార్థులకు వీడ్కోలు పలుకుతున్న అధికారులు

అసెంబ్లీకి విద్యార్థుల పయనం..

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

అమరావతిలో ఈ నెల 26న జరగబోయే రాజ్యాంగ అవతరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి ప్రకాశం జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుండి ఎంపికైన విద్యార్థి (ఎమ్మెల్యే ప్రతినిధులు) బృందం ఆదివారం ఒంగోలు ఎస్ఎస్ఏ కార్యాలయం నుంచి బయలుదేరింది. నియోజకవర్గం నుంచి ఒక్కొక్కరు చొప్పున ఎనిమిది మందిని ఎంపిక చేసి శాసనసభలో స్పీకర్, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ప్రతిపక్షనేత, అధికార, ప్రతిపక్ష శాసనసభ్యులు ప్రజలపక్షం వహిస్తూ సభలో ఎలా వ్యవహరించాలి, సభా గౌరవాన్ని ఎలా పాటించాలి, ప్రజావాణిని ఎలా వినిపించాలి అనే అంశాలపై పాఠశాల స్థాయి, మండల స్థాయిలో పోటీలు నిర్వహించి.. వారిలో ప్రతిభ కనబరచిన వారిని ఎంపిక చేసి అసెంబ్లీకి పంపుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అమరావతి వేదికపై ప్రజా సమస్యలను ధైర్యంగా ప్రస్తావించాలని, రాజ్యాంగ స్ఫూర్తిని అర్థం చేసుకుని ప్రజాస్వామ్య విలువలను పాటించాలని ఆయన సూచించారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో పాల్గొనడం జిల్లాకు గౌరవమని డీఈఓ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డిసిఇబి కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ఎన్.వి.ఎస్. కుమార్, జి ఉమామహేశ్వరి,ఇతర ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జుల పాలనలో మేజర్ పంచాయతీలు

పాలన కుంటుపడి ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అత్యధిక జనాభా కలిగిన మేజర్ పంచాయతీల్లో ఉన్న కార్యదర్శులకు పదోన్నతి కల్పించి బదిలీ చేయడంతో ఆయా పంచాయతీలకు ఇన్చార్జి కార్యదర్శులను నియమించారు. దీంతో ఆ పంచాయతీల్లో జరగాల్సిన ప్రధాన పనులు ముందుకు సాగక పాలన కుంటుపడుతుంది. ఎప్పటికప్పుడు ప్రస్తుతం ఉన్న ఇన్చార్జి కార్యదర్శులు తమకేందుకులే రెగ్యులర్ అధికారులు వస్తారని, వారు వచ్చిన తర్వాత చేసుకుంటారనే ధోరణిలో ఉన్నారు. మండలంలోని ఐలవరం, వెల్లటూరు, పెదపులివర్రు, భట్టిప్రోలు గ్రామాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఐలవరం కార్యదర్శిగా పనిచేస్తు పిఒపిఆర్డిగా పదోన్నతిపై వేమూరుకు బదిలీ అయ్యారు. వెల్లటూరు కార్యదర్శి డిప్యూటీ ఎంపిడిఒగా తిరుపతి వెళ్లారు. పెదపులివర్రు కార్యదర్శి పిట్లవానిపాలెం మండలానికి డిప్యూటీ ఎంపిడిఒగా పదోన్నతిపై వెళ్లారు. దీంతో ఈ మూడు పంచాయతీల్లో కార్యదర్శులు లేక ఇన్చార్జి పాలనలోనే కొనసాగుతున్నాయి. మండల కేంద్రమైన భట్టిప్రోలులో జరిగిన అవకతవకలతో ఇక్కడ పని చేసిన కార్యదర్శులు సస్పెండ్ అయ్యారు. అప్పటి నుండి ఓలేరు పంచాయతీ కార్యదర్శి ఇన్చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనకు భట్టిప్రోలుతో కలిపి మూడు పంచాయతీల బాధ్యతలు చూడాల్సి ఉంది. దీంతో పని భారం పెరిగి భట్టిప్రోలులో జరగాల్సిన పనులు జరగటం లేదనేది ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాక ఈ కార్యదర్శికి కూడా పదోన్నతి లభించే అవకాశం ఉందని, ఆయన

భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయం

కూడా బదిలీ అయ్యే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది. ఇన్చార్జిల పాలనలో సాగుతున్న ప్రధానమైన మేజర్ పంచాయతీలకు రెగ్యులర్ కార్యదర్శి ఉంటేనే పనులు కుంటుపడకుండా జరిగే అవకాశం ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అన్ని పనులు డిజిటలైజేషన్ చేసి నూతన యాప్‌లతో చేయాల్సిన దృష్ట్యా ఇన్చార్జిలకు పని భారం పెరిగింది. భట్టిప్రోలు పంచాయతీ వంటి వాటిలో పారిశుద్ధ్య నిర్వహించడం తలకు మించిన భారంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ఇలాంటి తరుణంలో మేజర్ పంచాయతీలకు తక్షణమే రెగ్యులర్ అధికారులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లెకోనకు డిడిఒ అధికారాలు లేక ఇబ్బందులు

మండలంలోని పల్లికోనలో గత ఆరు నెలలుగా పంచాయతీ అభివృద్ధి అధికారులకు డిడిఒ అధికారాలు లేకపోవడంతో గ్రామంలో ఏ పనులు చేపట్టాలన్న సాధ్యపడటం లేదు. గతంలో అమర్తలూరు పిఒపిఆర్డి ఇన్చార్జి డిఎల్‌పిఒగా పనిచేసిన నరసింహారావు ఆకస్మిక మృతితో పలు గ్రామాల్లో ఇలాంటి ఘటనలు ఎదురవుతున్నాయి. దీనిలో భాగంగానే పల్లెకోనలో కూడా ఎలాంటి డిడిఒ అధికారాలు గలిగిన అధికారి లేకపోవడంతో ఏ పని చేపట్టాలన్న అధికారులు జంకుతున్నారు. పంచాయతీలో ఏ పని చేయాలన్న ఆర్థిక అవసరాలు కలిగి ఉండటంతో నిధులు ఉన్నప్పటికీ డిడిఒ అధికారులు లేకపోవడంతో పనులు జరిపించడానికి, జరిగిన పనులకు నిధులు జమ చేసుకోవటానికి వీలు లేకుండా పోయింది. ఆరు నెలల నుండి అవస్థలు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం జిల్లా పంచాయతీ అధికారికి తెలిసినప్పటికీ పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రేడ్ 5 పంచాయతీ అభివృద్ధి అధికారులు తమకు వచ్చే అరకొర వేతనంతో పంచాయతీల్లో అభివృద్ధి పనులకు వెచ్చించడానికి సాహసించలేకపోతున్నట్లు తెలుస్తోంది. ఈ గ్రామంలో సర్పంచ్ కూడా పలు అవినీతి ఆరోపణలతో చెక్ పవర్ తొలగించారు. ఇక్కడ కనీసం ఈఒపిఆర్డికి ఇంచార్జి చెక్ పవర్ బాధ్యతలు అప్పగిస్తే కొంతమేర పనులు జరిపించడానికి ఆటంకం లేకుండా ఉంటుందని, ఆమేరకు జిల్లా పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై భట్టిప్రోలు ఈఒపిఆర్డి విజయబాబు మాట్లాడుతూ మేజర్ పంచాయతీలకు త్వరలో డిప్యూటీ ఎంపిడిఒలను కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఆమేరకు ప్రభుత్వం నుండి ఉత్తర్వులు లభించాయని అన్నారు. పల్లెకోనకు డిడిఒ అధికారాలు జిల్లా పంచాయతీ అధికారుల పరిశీలనలో ఉందని అన్నారు.

నమూనా అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి - బాపట్ల

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న రాష్ట్ర శాసన సభలో నిర్వహించనున్న నమూనా అసెంబ్లీకి జిల్లాకు చెందిన ఆరుగురు విద్యార్థి శాసన సభ్యులను ఎంపిక చేసినట్లు జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్ ఆదివారం తెలిపారు. రాష్ట్ర రాజధాని సచివాలయంలో జరిగే విద్యార్థుల నమూనా అసెంబ్లీకి హాజరయ్యేందుకు విజయవాడ లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణకు ఆరుగురు విద్యార్థులు బయలుదేరి వెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన విద్యార్థులు నమూనా అసెంబ్లీకి హాజరు కానున్నట్లు తెలిపారు. నమూనా అసెంబ్లీకి హాజరయ్యే విద్యార్థులను వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి నియోజకవర్గానికి ఒక్కొక్కరు చొప్పున డిఇఒ ఎస్ పురుషోత్తం ఆధ్వర్యంలో ఎంపిక చేసినట్లు తెలిపారు. వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండలం అనంతవరం జెడిపి ఉన్నత పాఠశాల విద్యార్థి కె ధనుష్, రేపల్లె నియోజకవర్గం నగరం మండలం పెద్దవరం జెడిపి ఉన్నత పాఠశాల విద్యార్థి ఎన్‌వి సూర్య మణికంఠ, బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలం పెదగొల్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి సహస్ర, పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లు మండలం పూసపాడు ఎన్‌కెవిఎన్ పాఠశాల విద్యార్థి ఎ రాజశేఖర్, అద్దంకి నియోజకవర్గం జె పంగులూరు మండలం కొండ మంజులూరు ఎస్‌ఆర్‌వైఆర్‌వై విద్యార్థి జాకబ్ జపన్యశాస్త్రి, చీరాల నియోజకవర్గం వేటపాలెం మండలం పందిళ్ళపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థి జె భాగ్యశ్రీ, చీరాల ఎన్ఆర్ అండ్ పిఎం ఉన్నత పాఠశాల విద్యార్థి జపన్య ఎంపికైనట్లు తెలిపారు. ఆరు నియోజకవర్గాల్లో ఒక్కొక్కరితో పాటు అదనంగా ప్రతిభ కనబరిచిన ఓ విద్యార్థిని ఎంపిక చేసి ఏడు గురు విద్యార్థులను ప్రత్యేక వాహనంలో నమూనా అసెంబ్లీకి హాజరయ్యేందుకు పంపినట్లు వివరించారు. నమూనా అసెంబ్లీలో విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లా ప్రతిభను ఇనుమడింప చేయాలని కంకటపాలెం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం టి వెంకటరాజు, సిజెపాలెం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వివి కృష్ణారావు, పెదగొల్లపాలెం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం సుభాషిణి కోరారు.

నమూనా అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థులతో టీచర్లు

పంగులూరు : అద్దంకి నియోజకవర్గం స్టూడెంట్ ఎమ్మెల్యేగా తమ పాఠశాల విద్యార్థి కె జాకబ్ జపాన్ శాస్త్రి ఎంపికైనట్లు మండలంలోని కొండమంజూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఇమ్మడిశెట్టి అనిత ఆదివారం తెలిపారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మాక్ అసెంబ్లీకి అద్దంకి నియోజకవర్గం నుండి ఎంపికైనట్లు తెలిపారు. జాకబ్ జపాన్ శాస్త్రిని ఉపాధ్యాయులు, ఎంఇఒ నాగభూషణం, వీరాంజనేయులు అభినందించారు.

తెలుగుదేశం ఆశయాల కోసం పనిచేయాలి

- టిడిపి పట్టణ అధ్యక్షునిగా డివి సురేష్
- ప్రమాణ స్వీకారం చేయించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - చీరాల

తెలుగుదేశం ఆశయాలు, సిద్ధాంతాల కోసం పనిచేస్తు పార్టీ బలోపేతానికి నూతన కమిటీ సభ్యులు కృషి చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. టీడీపీ చీరాల పట్టణ కమిటీ ప్రమాణస్వీకారం ఆదివారం నిర్వహించారు. స్థానిక కిరాణా మర్చెంట్స్ కళ్యాణ మండపంలో తెలుగుదేశం పట్టణ నూతన కమిటీతో ఎంఎల్ఎ కొండయ్య ప్రమాణస్వీకారం నిర్వహించారు. తొలుత టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల అర్పించి నివాళులర్పించారు. అనంతరం సత్యసాయిబాబా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దోగుపర్తి వెంకట సురేష్ తనను పట్టణ అధ్యక్షునిగా నియమిస్తూ, ఆయనతో

నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దృశ్యం

పాటు నూతన కమిటీ సభ్యులందరికీ ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించడం తమపై బాధ్యతను పెంచిందని అన్నారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలు, క్రమశిక్షణ, ప్రజాసేవ ఈ విలువలను ఎల్లప్పుడూ పాటిస్తూ టీడీపీ ప్రతిష్టను పెంచేలా విధులు నిర్వర్తించాలని కొత్త కమిటీకి సూచించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధనరావు, ఆప్కో చైర్మన్ డాక్టర్ సజ్జ హేమలత, టిడిపి స్థానిక నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

మృతుడి వివరాల కోసం 2 గంటల పాటు ఉత్కంఠ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

స్కూటీపై కూరగాయల కోసం వచ్చిన వ్యక్తి గుండె పోటుకు గురై ఒక్క సారిగా కుప్ప కూలి మృతి చెందిన విషాద ఘటన మార్టూరులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక స్టేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న పెద్ద ఖానా వద్ద కూరగాయల దుకాణంకు స్కూటీపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి కూరగాయలు తీసుకొని తిరిగి తన స్కూటీ దగ్గరకు వెళ్లి బండి స్టార్ట్ చేస్తుండగా ఒక్క సారిగా కుప్పకూలి క్రింద పడిపోయాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చి సదరు వ్యక్తిని ఒక్క రిక్షాలో ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా ఎదురుగా వచ్చిన 108 వాహన సిబ్బంది పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో వారు కేసు తీసుకోకుండా వెనుదిరిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతుడి స్కూటీని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలిపే ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో మృతుడి ఫోటోను వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశారు. బండి రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా విచారణ చేశారు. రెండు గంటల ఉత్కంఠ అనంతరం సమాచారం తెలుసుకున్నారు. చిలకలూరిపేట మండలం తాతపూడికి చెందిన మృతుడి బంధువులకు సమాచారం ఇవ్వడంతో మార్టూరు చేరుకున్నారు. మృతి చెందింది సోమేపల్లి శ్రీనివాసరావు (55) గా గుర్తించారు. మృతదేహాన్ని తాతపూడికి తరలించారు.

తూనికలు కొలతలు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి

సరిగ్గా కొలతలు లేకపోతే చర్యలు

ప్రజాశక్తి - పర్చూరు

దుకాణాల్లో తూనికలు, కొలతలు సరిగ్గా లేకపోతే దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతల విజిలెన్స్ అధికారి కె నాగేశ్వరరావు హెచ్చరించారు. మండల కేంద్రమైన పర్చూరులో మాంసం దుకాణాల్లో తూనికలు కొలతల యంత్రాలను ఆదివారం తనిఖీలు చేశారు. తూనికలు సరిగ్గా లేని 10 దుకాణాల యజమానులకు జరిమానా విధించారు. ఒక్కొక్క దుకాణానికి రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. తూనికల్లో అవకతవకలకు పాల్పడే దుకాణదారుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అలాంటి వారి సమాచారాన్ని తమకు తెలపాలని కోరారు.



వెండి తొడుగు బహుకరిస్తున్న దాతలు

ప్రసన్నాంజనేయునికి వెండి తొడుగు బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి ఉత్సవ మూర్తికి మోదడుగు రాంబాబు, ఇందిరా దేవి దంపతులు, వారి కుమారులు వెంకట శ్రీనివాసరావు, ఆంజనేయులు, కుమార్తె నాగాంజలి వెండి తొడుగు అంటే తల నుండి కాళ్ళ వరకు వచ్చే సర్వాంగం, గద బహూకరించారని పాలక మండలి అధ్యక్షుడు చుండూరు మురళి సుధాకరరావు, నూతి ప్రసాద్, పద్మజ, వెంకటరత్నం, అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడు, ప్రధాన అర్చకులు కోట లక్ష్మీనారాయణ ద్వారా బహూకరించారు. రూ.3.23లక్షల విలువైన 1.70కేజీల వెండితో తయారు చేయించినట్లు తెలిపారు. దాతలను దేవస్థానం పాలక మండలి, అధికారులు ఘన సన్మానం చేశారు.

కాల్వలో పడిపోయిన కారు

అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో కారు బోల్తా

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని కొమ్మాలపాడు సమీపంలో అద్దంకి, నార్కెట్‌పల్లి రహదారి అండర్ పాస్ కింద ప్రవహిస్తున్న అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో వినుకొండ నుండి అద్దంకి వైపు వెలుతున్న కారు అతివేగంగా వెలుతూ ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ తప్పించబోయి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ఒక్కసారిగా జరిగిన ఘటనతో కాలువలో వేకువ జామునే స్నానమాచరిస్తున్న అయ్యప్ప భక్తులు ఉలిక్కిపడ్డారు. కారులో డ్రైవర్ ఒక్కడే ఉండటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆ సమయంలో కాలువలో అయ్యప్ప స్వాములు స్థానాల నుంచి బయటకు లాగి ఒడ్డుకు చేర్చారు. కారులో ప్రయాణీకులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేకుంటే ప్రాణ నష్టం జరిగి ఉండేదని పలువురు తెలిపారు.

సైన్స్ ఆచరిస్తూ శాస్త్రీయ సమాజాన్ని నిర్మించాలి

శ్రీ గౌతమి కళాశాలలో జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి - చీరాల

విద్యార్థులు చిన్నతనం నుండి సైన్సు అలవర్చుకుని బాగా చదుకోవాలని, తద్వారా శాస్త్రీయమైన ఆలోచనల పట్ల ఆసక్తి పెంచుకొని శాస్త్రీయ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కుర్రా రామారావు అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు స్థానిక శ్రీ గౌతమి కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జాతీయ గీతం ఆలపించిన అనంతరం శ్రీ గౌతమి విద్యా సంస్థల అధినేత ఎం వెంకటేశ్వర్లు (ఎంవి) జాతీయ జెండాను, జెవివి జెండాను జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూఢ నమ్మకాలు విడనాడి విద్యార్థి దశ నుండే శాస్త్రీయ ఆలోచనలు పెంచుకోవాలని అన్నారు.

జెవివి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

తద్వారా జీవితంలో ఎంతో అభివృద్ధి చెందుతారని అన్నారు. విద్యార్థుల్లో మేదస్సు పెంచేందుకు జెవివి ఏర్పాటు చేసిన చెకుముకి సంబరాల పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల, ప్రయోగాలు పట్ల అభిమానాన్ని పెంచుకోవాలని అన్నారు. శాస్త్రీయమైన ఆలోచనలు అభివృద్ధి చేసుకోవాలని కోరారు. గత 36ఏళ్లుగా జెవివి విద్యార్థులకు చెకుముకి సంబరాలు నిర్వహిస్తూ శాస్త్రీయ సమాజా నిర్మాణం కోసం చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో బల్లికురవ, పర్చూరు, కారంచేడు మండలాల జడ్పీహెచ్ హై స్కూల్ విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలలో నిజాంపట్నం కుమార్ క్రియేటివిటీ అకాడమిక్, బాపట్ల లిటిల్ ఏంజెల్ పబ్లిక్ స్కూల్, చినగంజాం సత్యం, చీరాల విజ్ఞాన భారతి హై స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో కె మాల్యాద్రి, బి పిచ్చియ్య, బి సూరిబాబు, పి శ్రీనివాసరావు, గుమ్మా శ్రీను, పి రంగారావు, కుర్ర శ్రీను, చిమట వరప్రసాద్, లూకా, ఎం వెంకటేశ్వరరెడ్డి, దక్షిణామూర్తి, వెంకటేశ్వరరెడ్డి, హరిబాబు, పోతురాజు, వీరప్రసాద్, శివ నారాయణ పాల్గొన్నారు.

యోగాసనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

యోగాసనం పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పంగులూరు

ఎస్‌జిఎఫ్ 69వ రాష్ట్ర స్థాయి యోగాసనం పోటీలు మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆదివారం ప్రారంభం అయ్యాయి. ఉమ్మడి 13 జిల్లాల నుండి సుమారు 450 మంది క్రీడాకారులు యోగాసనం పోటీల్లో పాల్గొనేందుకు వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవంలో డిఇఒ ఎస్ పురుషోత్తం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఉపయోగ పడటంతో పాటు శారీరక దారుఢ్యం, ఆరోగ్యం మొదలైన అంశాలకు ఉపయోగపడతాయని అన్నారు. యోగాసనం వలన ఆరోగ్యానికి ఎంతో ఉపయోగమని, ప్రతి విద్యార్థి యోగాసనం నేర్చుకుంటే ఆరోగ్య సమస్యలను ఎదుర్కో వచ్చని చెప్పారు. యోగాసనం వలన మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు. ఏకాగ్రత, శాంతి ఏర్పడతాయని చెప్పారు. అలాంటి యోగాసన పోటీలు మొట్ట మొదటి సారిగా చందలూరులో ఏర్పాటు చేయటం ఆనందదాయ కమని అన్నారు. ఇండియన్ షటిల్ బ్యాట్మెంట్ నిపుణుడు కరణం చెంచుపున్నయ్య చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు యోగాసనాలు నేర్చుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విశాఖపట్నంలో యోగాసనాల కార్యక్రమాన్ని నిర్వహించిందని అన్నారు. ప్రధానమంత్రి స్వయంగా పాల్గొని యోగాసనాలు వేశారని చెప్పారు. ఆ కార్యక్రమంలో చందలూరు విద్యార్థులు పాల్గొనటం ఎంతో గర్వకారణమని చెప్పారు. యోగాసనాల కార్యక్రమాల్ని ప్రోత్సహిస్తూ విద్యార్థుల తరపున పీడీలు ప్రతిమ, మధును ఆయన అభినందించారు. కార్యక్రమంలో పర్చూరు డిప్యూటి డిఇఒ గంగాధర్, పాఠశాల మాజీ హెచ్ఎం ఎన్ తాతయ్య, గ్రామ పెద్దలు పెంట్యాల రామలింగస్వామి, అడ్డగడ వెంకట సుబ్బయ్య, మురకొండ సుబ్బారావు, పిడిలు, ఎస్‌జిఎఫ్ సెక్రెటరీలు వెంకటేశ్వరరావు, ప్రతిమ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొండయ్య

సేవా కార్యక్రమాలు అభినందనీయం

ప్రజాశక్తి - చీరాల

అఖిల భారత యాదవ మహా సంఘం ఆధ్వర్యంలో గుంటూరు శ్రీకృష్ణ ప్రాంగణంలో జరిగిన వన సమారాధన మహోత్సవంలో శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య పాల్గొని మాట్లాడారు. సమాజ సేవా దృక్పథంతో ఇలాంటి స్పూర్తిదాయక కార్యక్రమాలు నిర్వహించిన సభ్యులను అభినందించారు.

పట్టాలిచ్చారు గానీ.. స్థలాలు ఎక్కడ?

ప్రజాశక్తి - బట్టిప్రోలు

గత తెలుగుదేశం ప్రభుత్వంలో నిరుపేదలకు నివేశణ స్థలాల కోసం రైతుల నుండి భూములు కొనుగోలు చేసి లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలు ఇచ్చారు. అయితే నేటికీ స్థలాలు చూపకపోవటంతో నిరుపయోగంగా మారాయి. 2017 - 18 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశ ప్రభుత్వం నివేసిన స్థలాలు లేని లబ్ధిదారులను ఎంపిక చేసింది. మండలంలో వివిధ గ్రామాల్లో రైతుల నుండి భూములు కొనుగోలు చేసింది. దీనిలో పల్లికోన, ఓలేరు తదితర గ్రామాల్లో లబ్ధిదారు లకు కేటాయించిన స్థలాల్లో గృహ నిర్మాణం కూడా చేపట్టారు. కానీ ఐలవరంలో 40 మందికిపైగా లబ్ధిదా రులను గుర్తించి రైతుల నుండి 1.30ఎకరాలపైగా కొనుగోలు చేశారు. అప్పట్లో ఎన్నికలు సమీపించడంతో పట్టాలు ఇచ్చి స్థలం చూపలేదు. కానీ ఈ పట్టాల ప్రకారం లబ్ధిదారులకు స్థలాలు చూపించడలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహించారు. దీంతో పట్టాలు పొందిన లబ్ధిదారులు స్థలాలు ఎక్కడో తెలియక సొంత నివేసిన స్థలం, గృహం లేక అద్దె భవనాల్లో, కాలువ కట్టలపైన కాలయాపన చేస్తున్నారు. ప్రభుత్వం మారడంతో వైసిపి ప్రభుత్వ పాలనలో అనేక మంది నిరుపేదలకు నివేశణ స్థలాలు కేటాయించారు. ఆ సమయంలో అప్పటికే పట్టాలు పొందిన లబ్ధిదారులకు వైసిపి ప్రభుత్వం స్థలాలు ఇవ్వకుండా పక్కన పెట్టింది. దీంతో చేతిలో పట్టా ఉన్నప్పటికీ స్థలాలు ఎక్కడో తెలియక పోవటం, వైసిపి పాలనలో కూడా స్థలాలు పొందలేకపోవటం పట్ల లబ్ధిదారులు అసహనానికి గురవుతున్నారు. ఇదిలా ఉండగా కేటాయించిన స్థలాలకు అప్పట్లోనే టిడిపి ప్రభుత్వం మెరకలు తోలించింది. సుమారు ఎనిమిదేళ్ల క్రితం పట్టాల పొందిన లబ్ధిదారులకు తక్షణమే అధికారులు స్పందించి నివేశణ స్థలాలు అప్పగిస్తే గృహ నిర్మాణాలు చేపట్టుకునేందుకు వీలు కలుగుతుందని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దారు మేక శ్రీనివాసరావు మాట్లాడుతూ అప్పట్లో కేటాయించిన స్థలాలు పరిశీలించి పట్టాలు పొందిన లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

ఐలవరంలో పేదలకు కేటాయించిన నివేసిన స్థలం

మాంసం విక్రయాలపై తనిఖీలేవీ..?

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో మాంసం విక్రయాలపై తనిఖీలు లేవు. లక్షలపైగా జనాభా గల పట్టణంలో వేట, మేక మాంసం నాణ్యత ప్రమాణాలు తనిఖీలు చేసే పశు వైద్యుడు లేరు. పట్టణంలోని 3వ వార్డులో 2010లో చిన్న మధ్య తరహా పట్టణ ఏకీకృత అభివృద్ధి పథకం, 12వ ఆర్థిక సంఘం నిధులు రూ.22 లక్షలతో జంతు వతశాల నిర్మించారు. కొంత కాలం జంతు వధశాలలో మాంసం కోసం వధించే గొర్రెలు, మేకలకు పరీక్షలు నిర్వహిం చేవారు. అక్కడి నుండి తీసుకెళ్లిన మాంసాన్నే దుకాణా ల్లో విక్రయించేవారు. ఆ విధానం కొంతకాలం కొనసా గింది. రాను రాను ఇక్కడి జంతువధశాలలో జంతువు లు వధించే విధానానికి స్వస్తి పలికారు. దీంతో జంతు వధశాల అలంకార ప్రాయంగా మారింది. ఎక్కడపడితే అక్కడ జంతువులను వధించి మాంసం విక్రయాలు చేస్తున్నారు. పట్టణంలో వారంలో ఐదారు రోజులు పాటు మాంసాన్ని విక్రయించే దుకాణాలు ఉన్నాయి. ఆదివారమైతే పట్టణంలోని ఇస్లాంపేట, అడితీల సెంటర్, ఉప్పరపాలెం, పేరం గరుడాచలం సత్రం ప్రధాన రహదారి ఫుట్ పాత్‌పై, చీల్ రోడ్డు సెంటర్‌లో 20 వరకు వేట, మేక మాంసం, ఇతర జంతువుల మాంసాన్ని విక్రయిస్తుంటారు. చికెన్ దుకాణాలు ఎక్కడపడితే అక్కడే కోళ్లను కోసి బహిరంగంగా విక్రయిస్తుంటారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల దృష్ట్యా గొర్రెలు, మేకలకు సంక్రమించే వివిధ వ్యాధులను పరీక్షించే వైద్యాధికారిని నియమించాల్సిన పురపాలక అధికారులు నిమ్మకు నేరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజలకు విక్రయించే మాంసం నాణ్యత ప్రమాణాలు పరిశీలించకుండా విక్రయించే మాంసం తింటే రోగాలు బారిన పడితే పరిస్థితి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా జంతువధశాల

జిల్లా కేంద్రంగా రూపుదిద్దుకున్న పట్టణంలో శ్లాటర్ హౌస్ (జంతువధశాల) ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాస్థాయి అధికారులు పట్టణంలోనే నివాసాలు ఉంటున్నారు. వారిలో కొంతమంది మాంసా హారులు ఉన్నారు. జంతు వధశాల ఉందా లేదాని ఆయా శాఖల సిబ్బంది ద్వారా ఆరా తీసినట్లు తెలిసింది. లేదని తెలిసి ఇదేమిటని చర్చ జరిగినట్లు తెలిసింది. జంతువదశాల ప్రహరీ గోడ, ప్రధాన గేటు సిసి రోడ్డు నిర్మాణానికి అడ్డంగా ఉందని తొలగించి అక్కడ సిసి రోడ్ వేశారు.

నేను వచ్చినప్పటి నుండి కబేళా అలాగే ఉంది

తాను మున్సిపల్ కమిషనర్‌గా వచ్చేసరికే జంతువధశాల అలాగే ఉందని కమిషనర్ రఘునాధరెడ్డి అన్నారు. దీన్ని తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఒకవైపు ప్రహరీ గోడ నిర్మించాల్సి ఉందని అన్నారు. తొలగించిన గేటు తిరిగి ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులు ఆయా పనులకు అంచనాలు తయారు చేయాలని సూచించినట్లు తెలిపారు.

పరామర్శిస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి అశోక్ కుమార్

ప్రసాదరెడ్డికి అశోక్‌కుమార్ పరామర్శ

ప్రజాశక్తి - బల్లికురవ

వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లి అంజనీ ప్రసాదరెడ్డి తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న వైసిపి ఇంచార్జ్ చింతలపూడి అశోక్ కుమార్ మండలంలోని ఉప్పుమాగులూరులోని ప్రసాదరెడ్డి గృహానికి వెళ్లి పరామర్శించారు. ప్రసాదరెడ్డి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.

సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి సంతకాలు సేకరణ

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక బొమ్మల సెంటర్‌లో వైసిపి ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి మండల కన్వీనర్ కఠారి అప్పారావు ఆధ్వర్యంలో 'కోటి సంతకాల ప్రజా ఉద్య మం' ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో లంక శివ, కోట శ్రీనివాసరావు, ముప్పాళ్ళ రాఘవయ్య, కంచన పల్లి రమేష్, పత్తిపాటి రవీంద్ర, గెరా భాస్కరరావు, యద్దనపూడి హరిప్రసాద్, గాదె సురేష్, దుడ్డు అంకమ్మ పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరైన బలరాం

వధూవరులకు 'బలరాం' ఆశీర్వాదం

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని హరిప్రసాద్ నగర్ 29వ వార్డు కౌన్సిలర్ బత్తుల అనిల్ కుమార్ మేనకోడలు రాజేశ్వరి, వెంకటేష్ వివాహ వేడుకకు మాజీ శాసన సభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, వైసిపి ఇంఛార్జి కరణం వెంకటేష్ బాబు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

వైవిపై కల్తీ నెయ్యి కేసు నెట్టే ప్రయత్నం

ప్రజాశక్తి - బల్లికురవ

టిటిడిలో కల్తీ నెయ్యి కేసును టిటిడి మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి పేరును పదే పదే వినియోగిస్తూ ఆయనను వేదనకు గురి చేస్తున్నారని వైసిపి మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లా డారు. వైవి పట్ల సిట్ వేధింపులను ఖండించారు. దురుద్దే శంతోనే ఆయనపై అపవాదు మోపుతున్నారని అన్నారు. ఎంత మందిని విచారించినా అందులో వైవి పాత్ర లేదని స్పష్టంగా తేలినప్పటికీ ఆయనపై ఆరోపణలు చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కక్ష పూరిత చర్యలు ప్రజలు హర్షించరని ప్రభుత్వపెద్దలు తెలుసు కోవాలని అన్నారు.

పేకాట జూదరుల అరెస్టు

ప్రజాశక్తి - మద్దిపాడు

పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటసూర్య తెలిపారు. మండలం లోని గుండ్లపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో ముగ్గురుని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.2200 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఉపాధి కల్పనకు కృషి

- నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల నిర్మాణం
- మంత్రి డిబివి స్వామి
- ఆటో నగర్‌లో పనులకు మంత్రుల శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కొల్లు రవీంద్ర, స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

యువత ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర మంత్రులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఒంగోలు త్రోవగుంట వద్ద ఉన్న ఆటో నగర్‌లో రూ.10.95 కోట్లతో సిసి రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణాల పనులను రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీఐఐసి చైర్మెన్ రామరాజులతో కలిసి ఎమ్మెల్యే దామచర్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ తమ ప్రభుత్వం చిత్తశుద్ధికి ఆటోనగర్‌లో జరుగుతున్న అభివద్ధి పనులు నిదర్శమని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించారని తెలిపారు. కనిగిరి వేదికగా సిఎం చంద్రబాబు నాయుడు ఒకేసారి రాష్ట్రంలో 90కి పైగా ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేశారన్నారు. ప్రకాశం జిల్లా అభివృద్ధిపై సిఎం ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు.

ఆటోనగర్‌లో సమస్యలన్నీ పరిష్కరిస్తా..

ఆటో నగర్‌లో సమస్యలన్ని పరిష్కరిస్తామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జన్దానరావు తెలిపారు. 1982లో ఆటోనగర్ ఏర్పాటు చేశారని, గత ఎన్నికల సమయంలో ఇక్కడి సమస్యలను తన దష్టికి తీసుకురాగా, ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఆటోనగర్‌లో మంచినీటి వసతి కల్పించేందుకు ఎంపి లాడ్స్ నుండి 25 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, ఏపిఐఐసి చైర్మన్ రామరాజు, జోనల్ మేనేజర్ మదన్‌మోహన్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ఆటోనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యతో పాటు

ఆటలు కూడా అవసరం

- మంత్రి స్వామి
- రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-శింగరాయకొండ

విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు కూడా చాలా అవసరమని ఆ క్రీడల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఆదివారం నాడు శింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయి బాలబాలికల హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అండర్ 19 రాష్ట్రస్థాయి బాల బాలికల హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభోత్సవం సందర్భంగా ముందుగా జాతీయ జెండాను మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, స్కూల్ గేమ్స్ జెండాను కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, క్రీడా జెండాను రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఎగరవేశారు. అనంతరం పీడీ ఎన్‌టి.ప్రసాద్ క్రీడాజ్యోతిని తీసుకొచ్చి మంత్రి డాక్టర్ స్వామికి అప్పగించారు. మంత్రి డాక్టర్ స్వామి క్రీడాజ్యోతిని వెలిగించి.. రాష్ట్రస్థాయి బాలబాలికల హ్యాండ్ బాల్ పోటీలకు ఆయన ప్రారంభోత్సవం చేసి అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. నేడు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా చాలా అవసరమని వివరించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువు కోసం ఎంత పోటీ పడుతున్నారో అదే రీతిలో ఆటల మీద కూడా పోటీ పెరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో అన్ని వసతులూ కల్పించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా స్పోర్ట్స్ కోటాలో ఇటీవల కాలంలో ఎంతోమంది ఉద్యోగాలు సాధించడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలో గెలుపొందితే జాతీయ స్థాయి పోటీల్లో నిలబడితే ఖచ్చితంగా ఉద్యోగాలు వస్తాయన్నారు. క్రీడలు ఆడడం ద్వారా ఆరోగ్యం కూడా బాగుంటుందని ఆయన వివరించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కూడా గతంలో ఐదు సంవత్సరాలు క్రీడలకు విద్యార్థులు దూరంగా ఉన్నారని ప్రస్తుతం క్రీడల కోసం అన్ని రకాలుగా ప్రోత్సాహం అందించడం జరుగుతుందని వివరించారు.కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి క్రీడాకారులు ప్రకాశం జిల్లాకి రావటం చాలా ఆనందకరమన్నారు. ఆటల్లో గెలుపోటములను తేలిగ్గా తీసుకొని ప్రతి విద్యార్థి గెలిచేందుకు కషి చేయాలని ఆయన సూచించారు. రాష్ట్ర మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో ఇలాంటి వసతులతో కూడిన క్రీడలు లేవని, ఇప్పుడు అన్ని వసతులతో కూడిన క్రీడలు రావడం జరిగిందన్నారు. ఇటీవల కాలంలో మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాల విద్యను బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయిలో ఆటలు కొండేపి నియోజకవర్గంలో జరగటం ఆనందంగా ఉందని, ప్రతి విద్యార్థి గెలుపోటములు సహజంగా తీసుకొని ఆట ఆడాలన్నారు. కార్యక్రమంలో డిఐఈఓ కె ఆంజనేయులు కళాశాల ప్రిన్సిపాల్ ఎం సౌజన్య సెక్రెటరీ ఈ చింపా రెడ్డి, కళాశాల పిడి కె శంకర్రావు, వెంకట్రావు, చిగురుపాటి శేషగిరి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మించల బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలకు వచ్చిన వివిధ జిల్లాల క్రీడాకారులు

పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

ప్రతి ఆదివారం హ్యాపీ సండే

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-బాపట్ల

ప్రతి ఆదివారం హ్యాపీ సండే కార్యక్రమంలో పట్టణ ప్రజలు భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక బాపట్ల పట్టణం, బావ నారాయణ స్వామి ఆలయం వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో హ్యాపీ సండే, సంతోషం సందడి మరియు ఆరోగ్యం, ఆనందం కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాధ్ రెడ్డితో కలసి కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హ్యాపీ సండే కార్యక్రమంలో పట్టణ ప్రజలు భాగస్వాములు కావాలని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక విజన్ తో ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారని, అందులో భాగంగా హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇకపై పట్టణంలో ప్రతి ఆదివారం సాయంత్రం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల బాలబాలికల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయని తెలిపారు.

రానున్న ఆదివారం రోజు సాంస్కృతి కార్యక్రమాలలో పాల్గొనదలచిన బాలబాలికలు ముందుగానే మున్సిపల్ కమిషనర్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఉన్న వివిధ రకాల కళారూపాలను ప్రదర్శించుకొనడానికి హ్యాపీ సండే కార్యక్రమం మంచి వేదికని తెలిపారు. ఇక్కడ ప్రదర్శించిన బాల బాలికలకు సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందని దాని ద్వారా రాష్ట్రస్థాయి లో కూడా పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల బాల బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పుర ప్రజలను ఆకట్టుకున్నాయి.

ప్రజా రవాణాలో సమర్ధవంత సేవలు

- ఆర్‌టిసి డిపోల అభివద్ధికి చర్యలు
- స్త్రీ శక్తి పథకం సమర్ధవంతంగా నిర్వహణ
- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లాలో ప్రజారవాణా వ్యవస్థను ప్రజల అవసరాలకు అనుగుణంగా సమర్ధవంతంగా నిర్వహించడం కోసం యంత్రాంగం తీవ్రంగా కషి చేస్తున్నట్లు ఆర్టీసి రీజనల్ మేనేజర్ జి.సత్యనారాయణ పేర్కొన్నారు. రవాణా సౌకర్యం మెరుగుపరచడం, స్త్రీశక్తి పథకాన్ని సమర్ధవంతంగా నిర్వహించడం, ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించడం, జిల్లా లోని బస్ డిపోలు,బస్సు స్టాండ్లలో మౌలిక వసతులు అభివద్ధి పరచడం, ఆర్ టిసి సిబ్బంది పెండింగ్ సమస్యలు పరిష్కరించడం,ఆర్ టిసి నష్టాలను అధిగమించడానికి ఆర్ టిసిలో అన్ని విభాగాల యంత్రాంగాన్ని సమన్వయం చేసుకోవడం ద్వారా మంచి ఫలితాలు రాబట్టేందుకు కషి చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేసారు. ప్రకాశం జిల్లా పరిధిలో ఆర్ టిసి సేవలు గురించి ఆయన ప్రజాశక్తి తో సాగిన ముఖాముఖి...

నష్టాలను అధిగమించే దిశగా..

గత సంవత్సరం రూ. 18.83 కోట్ల నష్టంలో ఉన్న జిల్లాను ప్రభుత్వ పథకాల అమలు ద్వారా రూ 8.24 కోట్లకు తగ్గించడానికి జిల్లా పరిధిలో ఐదు డిపోల పరిధిలోని పరిపాలన యంత్రాంగంతో పాటు డ్రైవర్లు, కండక్టర్లు, గేరేజ్ సిబ్బంది విశేష కషి వల్ల ఫలితాలు సాధించగలిగాం. ప్రస్తుతం జిల్లా పరిధిలోని ఐదు ఆర్టీసీ డిపోల్లో మొత్తం 485 బస్సులు (384 ఆర్టీసీ, 101 అద్దె బస్సులు) రోజు రెండు లక్షల కిలోమీటర్లు మేర సుమారు 1.90 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నాం. సామాజిక అవసరాలకు(వివాహాది శుభకార్యలకు, విజ్ఞాన యాత్రలకు, పుణ్య క్షేత్రాలకు) కాంట్రాక్ట్ పద్దతిలో అద్దె ప్రాతిపదికన అందిస్తూ ఆదాయం సమకుర్చుకునే కషి సాగుతుంది.

ఆర్టీసీ డిపోల అభివద్ధికి చర్యలు...

జిల్లాలో మూడు డిపోల్లో అభివద్ధి పనులకు శ్రీకారం చుట్టాం.మార్కాపురం డిపోలో సీసీ రోడ్డుల కోసం రూ.15 లక్షలు, కాంపౌండ్ వాల్‌కు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. డ్రైనేజీ-మరుగుదొడ్ల విస్తరణకు రూ 25 లక్షల ప్రతిపాదనలు పంపాము. కాగా కనిగిరి డిపోలో గ్యారేజ్ షెడ్లు, టాయిలెట్స్, మున్సిపల్ వాటర్ లైన్, సీసీ రోడ్ల మరమ్మతులకు మొత్తం రూ 50 లక్షల ప్రతిపాదనలు రూపొందించాము. గిద్దలూరు డిపోలో అప్రోచ్ రోడ్డు, బిల్డింగ్ మరమ్మతులు, మరుగుదొడ్ల టైల్స్ వంటి పనులకు రూ.1 కోటి ప్రతిపాదనలు ఎండీ కార్యాలయానికి పంపించారు. ఇటీవల ఆర్ టిసి మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ ద్వారకా తిరుమలరావు ఈ మూడు డిపోలు సందర్శించిన నేపథ్యంలో ఆయా డిపోల్లో నెలకొన్న సమస్యలు ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు.

స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలు...

స్త్రీ శక్తి పథకం మహిళల రవాణా అవకాశాలను విస్తతం చేస్తూనే, ఆర్టీసీపై భారీ బాధ్యతను మోపింది. అయితే జిల్లాలోని ఆర్టీసీ విభాగం దీనిని అవకాశంగా తీసుకుని సేవలను విస్తరించడానికి ముందడుగు వేస్తోంది. తుపాను లాంటి విపత్తుల్లోనూ సేవలను నిలపకుండా, ఉచిత ప్రయాణ పథకం వల్ల రద్దీ పెరుగుతున్నప్పటికీ కొత్త బస్సులు ప్రతిపాదించడం జరిగింది.ఆగస్టు 15 నుంచి అమల్లో ఉన్న స్త్రీ శక్తి పథకం మహిళలకు పెద్ద ఉపశమనం కలిగిస్తోంది.75 రోజుల వ్యవధిలోనే రూ.30 కోట్ల రాయితీ జిల్లాలోని మహిళలు పొందడం ఈ పథకం విస్తత వినియోగాన్ని సూచిస్తోంది.ప్రతిరోజూ సగటున 90 వేలమంది మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు.

మరిన్ని సౌకర్యాలు..

స్త్రీ శక్తి పథకం దీని వల్ల బస్సుల్లో మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది. రద్దీ పెరగడంతో బస్ స్టేషన్‌లలో మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి చర్యలు ప్రారంభం అయ్యాయి. టాయిలెట్లు, షెడ్లు ఏర్పాటు చేస్తున్నాం. స్త్రీ శక్తి పథకం అమలు తర్వాత పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రతి డిపోకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశాం. జిల్లా వ్యాప్తంగా 25 కొత్త పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల ప్రతిపాదనలు పంపించాంబస్సులు నిరంతరం సేవలందించేందుకు షెడ్యూల్-3, షెడ్యూల్-4 విధానాలు కఠినంగా అమలు చేస్తున్నాం. రాత్రివేళ తనిఖీలు, ముందస్తు మెటీరియల్ ప్లానింగ్, జిల్లా స్థాయి పర్యవేక్షణతో బ్రేక్‌డౌన్ రహిత ప్రయాణం లక్ష్యంగా చర్యలు చేపట్టాం.

విస్తృతంగా ప్రమోషన్లు - కారుణ్య నియామకాలు..

సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న సిబ్బంది ప్రమోషన్ల విషయం లోజిల్లాలో 249 మందికి గ్రేడ్ 1 పదోన్నతులు కల్పించడంతో పాటు, కోర్టు వివాదంలో ఉన్న 150 కంట్రోలర్లు గా ప్రమోషన్లు కల్పించాం . ఇటీవల మరణించిన 178 ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించడం జరిగింది. 711 మందికి వార్షిక ఇంక్రిమెంట్లు, 811 మందికి స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు ఇచ్చాము.